4 పేజీలు 7 నయా పైసలు ANDHRA JANATHA HYDERABAD Rege No: H 634

హైద్రాబాద్‌లో 60 సంవత్సరాల నుంచి
ప్రఖ్యాతిగాంచిన షోరూమ్
హార్డి అండ్ కో
124, మహాత్మా గాంధీ రోడ్, సికింద్రాబాద్, ఫోన్ నం: 7116.
60 సంవత్సరాల నుంచి మీ సేవ చేస్తున్న మా సుప్రసిద్ధ కంటి వైద్యులచే మీ దృష్టిని పరీక్ష చేయించుకోండి. అమెరికా గ్లాసులతో తయారైన కండ్ల జోడును ధరించండి. డాక్టర్ల సలహాలు జాగ్రత్తగా పరిశీలించబడును. సమంజసమైన ధరలు.
(Khan & Sons)

ఆంధ్రజనత

హైద్రాబాద్, సోమవారం 16-11-1959 సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం సంపుటి 5 సంచిక 140

సరి కొత్త రకాలలోను, డిజైన్లలోను, రంగులలోను,
కాశ్మీర్ సిల్కు — ఔరంగాబాద్ సిల్కు
చీరలు
భారీ ఎత్తున ఇప్పుడే వచ్చినవి
మీకు కావలసిన వాటిని వెంటనే తీసుకోండి
అక్బర్ బ్రదర్స్
ఆబిడ్ రోడ్, హైదరాబాద్, ఫోన్ : 5218
(Khan & Sons)

ఇండియా, చైనా సరిహద్దు వివాదంపై రెండవ శ్వేతపత్రం

పాఠ్య పుస్తకాల పరిశీలనకు అడ్‌హాక్ కమిటీ

హైద్రాబాద్, నవంబర్ 14

ఆంధ్ర ప్రాంతంలో 11 వ తరగతి (ఎస్. ఎస్. ఎల్. సి.) కై ప్రభుత్వ పరీక్షల కమిషనర్‌చే నిర్ణయించబడిన పుస్తకాలు మినహా 9, 10, 11 వ తరగతుల కొరకు పాఠ్య పుస్తకాలను పరిశీలించే నిమిత్తం ప్రభుత్వం ఒక అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసినదని నమోదైనట్టి అందరు ప్రచురణ కర్తలకు తెలియజేయడమవుతున్నది. అడ్‌హాక్ కమిటీ పరిశీలనార్థం తమ ప్రచురణలను దాఖలు చేయగోరే ప్రచురణ కర్తలు వారు పంపదలిచిన ప్రతి పుస్తకం యొక్క ఏడేసి ప్రతులను హైద్రాబాద్ చాపిల్ రోడ్డులో గల ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ డైరెక్టర్‌కు 1959 డిసెంబర్ 15 వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు అందునట్లు పంపించవలెను.

ఈ విషయంలో అనుసరించ వలసిన పద్ధతిని గురించి, స్క్రూటినీ ఫీజు మొదలైన వివరాలను గురించి తెలుసుకోవడానికి ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించబడుతున్న ప్రకటనను చూడవచ్చును. నమోదైన ప్రచురణ కర్తలకు వ్యక్తిగతంగా కూడా నోటీసులు పంపబడుతున్నాయి.

నేడే లోక్ సభకు సమర్పణ

న్యూఢిల్లీ, నవంబర్ 15

సరిహద్దు వివాదం విషయంపై ఇండియా, చైనా ప్రభుత్వాల మధ్య సాగిన ఉత్తరప్రత్యుత్తరాలకు సంబంధించి భారత ప్రభుత్వం రేపు రెండవ శ్వేత పత్రాన్ని లోక్ సభలో ప్రవేశ పెట్టవచ్చునని తెలుస్తున్నది.

ఐదు వారాల పాటు జరుగ నున్న లోక్ సభ శీతాకాల సమావేశం రేపటి నుంచి ప్రారంభమౌతున్నది.

ప్రశ్నోత్తరాల సమయంలో ప్రజా సోషలిస్టులు, జనసంఘ సభ్యులు ఇటీవల లడక్ వద్ద జరిగిన సంఘటన విషయాన్ని లేవనెత్తటానికి ప్రయత్నించ వచ్చు లేదా ఇండియా, చైనా సంబంధాల పైన, శ్వేత పత్రం పైన త్వరలో చర్చ ఏర్పాటు చేయాలని వాయిదా తీర్మానం ద్వారా కోరవచ్చు.

కాలువ నీటి వివాదానికి సంబంధించి వాషింగ్‌టన్ సంభాషణల్లో ఇంతవరకు జరిగిన పర్యవసానాన్ని గూర్చి ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖా మంత్రి రేపు ఒక ప్రకటన చేస్తారు.

శాసన సభల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతుల సీట్ల రిజర్వేషన్ పదుపాయాన్ని విస్తరించటానికి వీలుగా రాజ్యాంగాన్ని సవరించటానికి సంబంధించిన బిల్లును హోమ్ మంత్రి పండిట్ పంత్ బహుశా ప్రవేశ పెట్ట వచ్చు.

ఇథియోపియా యువరాజు రాక
విమానాశ్రయంలో డాక్టర్ రాధాకృష్ణ ప్రభృతుల స్వాగతం

న్యూఢిల్లీ, నవంబర్ 15

కలకత్తా నుంచి భారత వైమానిక దళానికి చెందిన విమానంలో నేడిక్కడకు వచ్చిన ఇథియోపియా యువరాజ దంపతులకు విమానాశ్రయంలో డాక్టర్ రాధాకృష్ణ, రక్షణ మంత్రి శ్రీ కృష్ణమేనన్ ప్రభృతులు స్వాగతమిచ్చారు. అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తరపున ఆయన సైనిక ఉపకార్యదర్శి ఈ రాజదంపతులకు స్వాగతమిచ్చారు.

ఇథియోపియా యువరాజు గౌరవార్థం 21 తుపాకులు పేల్చబడ్డాయి. పదాతి, నౌకా, వైమానిక దళాల సైనికులు సంయుక్తంగా సమర్పించిన గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఆ తరువాత రాజదంపతులకు విమానాశ్రయానికి వచ్చిన దౌత్యరాయబారులు, ఇతర ప్రభుత్వ ప్రముఖులు పరిచయం చేయబడ్డారు.

ఈ రాజదంపతులు ఇక్కడనుంచి 18వ తేదీని శ్రీనగర్ వెళ్ళి, ఆ తరువాత ఆగ్రా, జైపూర్, బొంబాయి, పూనా మొదలైన నగరాలను సందర్శిస్తారు.

ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల ఎన్నికల రద్దు
ఎన్నికల ట్రిబ్యునల్ తీర్పు

రాయచూర్, నవంబర్ 15

కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు శ్రీ అగాడి సంగన్న, శాసన సభ్యులు శ్రీ శంకర్ గౌడ్ అల్వాండీ గారల ఎన్నికలు చెల్లవని రాయచూర్‌లోని ఎన్నికల ట్రిబ్యునల్ నిన్న తీర్పు నిచ్చింది.

కొప్పల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికైన శ్రీ సంగన్న, యెల్బుర్గ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన శ్రీ అల్వాండీల ఎన్నికలను సవాలుచేస్తూ శ్రీ శివమూర్తి స్వామి, శ్రీ వీరభద్ర సిరూరుగార్లు చేసిన దరఖాస్తులపై ట్రిబ్యునల్ ఈ ఉత్తర్వులను చేసింది.

శ్రీ అల్వాండీ స్థానే మైసూరు శాసన సభకు శ్రీ వీరభద్ర సిరూరు ఎన్నికైనట్లు కూడా ట్రిబ్యునల్ నిర్ణయించింది.

ఆక్రమిత కాశ్మీర్ మాజీ అధ్యక్షుని అరెస్టు

రావల్పిండి, నవంబర్ 15

ఆక్రమిత కాశ్మీర్ మాజీ అధ్యక్షుడు సర్దార్ మహమ్మద్ ఇబ్రాహీంను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలలో విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాడనే నేరానికి సైనిక శాసన నిబంధనలకింద నిన్న అరెస్టు చేశారు.

బాల సాహిత్యానికి ప్రోత్సాహం
6 వ పోటీ ఏర్పాటు

న్యూఢిల్లీ, నవంబర్ 15

శిశు సాహిత్యాన్ని ప్రోత్సహించే పథకాన్ని పురస్కరించుకొని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ పిల్లల పుస్తకాలలో 6 వ పోటీని నడుపుతున్నది.

మొత్తం 30 బహుమతులు ఉంటాయి. వీటిలో 15 వెయ్యి రూపాయల బహుమతులు. మిగతా పదిహేను 500 రూపాయల బహుమతులు. వివిధ భారతీయ భాషలలో రచించబడిన ఉత్తమ వ్రాత ప్రతులకు బహుమతులు సమర్పిస్తారు. వ్రాత ప్రతులు పంపటానికి ఆఖరి గడువు 1960 మార్చి 30.

తుకేర్‌గ్రామ్
భారత దేశానికి నేడే తిరిగి అప్పగింత

గౌహాతి, నవంబర్ 15

లోగడ ప్రకటించినప్రకారం తుకేర్ గ్రామ్‌ను పాక్ ప్రభుత్వం రేపు ఖాళీ చేయబోతున్నది. కరిమ్‌గంజ్ వద్ద ఉన్న ఈ గ్రామాన్ని భారత పోలీసులు రేపు ఉదయం స్వాధీనపరుచుకొంటారు.

ఇండోర్, నవంబర్ 15

మధ్య ప్రదేశ్ తృతీయ పంచవర్ష ప్రణాళికా వ్యయం 400 కోట్లు ఉండునని ముఖ్యమంత్రి డాక్టర్ కైలాస్ నాథ్ కట్జూ నిన్న ప్రకటించారు.

భారత సరిహద్దు పోలీసుల అప్పగింత
చనిపోయిన వారికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

శ్రీనగర్, నవంబర్ 15

గత నెల 21 వ తేదీని జరిగిన లడక్ సంఘటనలో ఖైదీలుగా పట్టుకొన్న 10 మంది భారతీయ పోలీసు దళం సభ్యులను, ఆ సంఘటనలో చనిపోయిన తొమ్మిది మంది శవాలను హాట్ స్ప్రింగ్సు వద్ద చైనా సైనిక దళం భారతీయ సైనిక దళానికి నిన్న అప్పగించినది.

లడక్ సంఘటన సమయంలో భారతీయ గస్తీ దళానికి నాయకత్వం వహించిన శ్రీ కరణ్‌సింగ్ కూడా అప్పగించబడిన వారిలో ఉన్నట్లు ఇక్కడికి చేరిన వార్తల వల్ల తెలుస్తున్నది. ఆయనకు మంచుదెబ్బ వలన వచ్చిన రుగ్మత తప్ప మరే అనారోగ్యమూ లేనట్లు తెలుస్తున్నది.

చైనా నుంచి అప్పగించుకున్న సైనికుల మృత కళేబరాలకు నేటి ఉదయం 8 గంటలకు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.

ఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ కార్యాలయంలో మృతులైన వారి పేర్లు, అప్పగించుకొనబడిన వారి పేర్లు ప్రకటించింది:

అప్పగించుకొనబడినవారు: డిప్యూటీ సూపరింటెండెంటు కరంసింగ్, జమేదార్ రూపియారామ్, గురుబహదూర్ సుదర్శన్, అబ్దుల్ మజీద్, శివదయాల్, సెరింగ్ నార్బు, మహమద్ ఖలీల్, సోనమ్‌దోర్జీ, ఛేతమ్.

మృతులు: ధరమ్‌సింగ్, శివనాథ్ ప్రసాద్, ఇమాన్‌సింగ్, హంగ్జిత్‌సుబా, సెరింగ్‌నర్బూ, నొర్బులామా, సర్వన్‌దాస్, జేగ్ రాజాజీ, పురన్‌సింగ్.

మఖన్‌లాల్ అనే కానిస్టేబుల్ జాడ ఇంకా తెలియలేదని కూడా ఈ ప్రకటన వివరించింది

ప్రభుత్వం ప్రకటించిన రెండు జాబితాలలోనూ సెరింగ్ నర్బూ పేరు ఉంది. మఖన్‌లాల్ జాడ తెలియలేదని ప్రకటించబడింది.

పట్టుబడిన వారికి సకల సౌకర్యాలు కల్పించారట

హాంకాంగ్, నవంబర్ 14

లడక్ సంఘర్షణలో పట్టుబడిన ఖైదీలను, మరణించినవారి శవాలను ఇండియాకు తిరిగి అప్పగించే కార్యక్రమం "మంచి వాతావరణంలో" జరిగిందని నవచైనా వార్తా సంస్థ పెకింగ్ నుంచి పంపిన ఒక వార్త తెల్పుతున్నది,

అప్పగింత తర్వాత భారత ప్రతినిధి శ్రీ త్యాగి "భారత ప్రభుత్వం, నేను చైనీస్ ప్రజలకు చాలా కృతజ్ఞులమై ఉంటాము" అని అన్నట్టు వార్తా సంస్థ తెల్పినది.

ఖైదు చేయబడిన భారత గస్తీ పోలీసు దళం నాయకుడు కరంసింగ్ సరిహద్దు దాటిన తర్వాత చైనీస్ దళాన్ని ఉద్దేశించి చేయి ఆడించి "సెలవు, చైనీస్ సోదరులారా" అని అన్నట్టు కూడా ఆ వార్తా సంస్థ తెల్పినది.

ఖైదీలు, శవాల అప్పగింత "చైనా వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోఉన్న హాంగ్‌కా కనుమ వద్ద" జరిగినదని వార్తా సంస్థ తెల్పినది. ఒకరి తర్వాత ఒకరు పది మంది సిపాయిలను, శవాలను, ఆయుధాలను, మందుగుండు సామగ్రిని భారత దళానికి అప్పగించారట.

చైనా వారివద్ద నిర్బంధంలో ఉన్న సమయంలో భారత పోలీసుల పట్ల ఎంతో శౌర్యధీరతతో ప్రవర్తించటం జరిగిందని, వారికి దూది వేసి కుట్టిన దుస్తులు, నిత్యావసర వస్తువులు సరఫరా చేయబడ్డాయని వార్తా సంస్థ తెల్పినది.

గాయపడిన వారికి, వ్యాధిగ్రస్తులైన వారికి "సమయానికి వైద్య సహాయం" అందచేయబడిందట. స్వదేశానికి తిరిగి వెళ్లే ముందు భారతీయులు చైనావారు తమ పట్ల ప్రదర్శించిన ఆదరాభిమానాలకు అనేకసార్లు వారికి కృతజ్ఞత లర్పించారట.

తొమ్మిది శవాలను చైనీస్ సరిహద్దు దళాల వారు యథోచితంగా ఖననం చేశారని, భారత దళానికి అప్పగించే ముందు భారతీయ సాంప్రదాయం ప్రకారం వాటిని నూతన వస్త్రాలలో చుట్టి ఇచ్చారని కూడా వార్తా సంస్థ తెల్పినది.

రాజధానిలో సంతాపం

హైద్రాబాద్, నవంబర్ 15

అక్టోబర్ 21వ తేదీన లడక్ సరిహద్దులలో చైనా దురాగతానికి బలియై పోయిన భారత పోలీసులకు దేశం అంతటితో పాటు ఆంధ్ర ప్రదేశ్‌లోని 45 వేల మంది పోలీసులు నేడు సంతాపం ప్రకటించారు. రాజధానిలో ఉదయం ఎనిమిది గంటలకు (మృతుల అంత్యక్రియలు సరిగ్గా అదే సమయంలో జరిగాయి) పోలీసు అధికారులంతా 2 నిమిషాలు నిశ్శబ్దాన్ని పాటించారు.

నెహ్రూ ఢిల్లీ ప్రయాణం

డెహ్రాడూన్, నవంబర్ 15

రెండు రోజుల విశ్రాంతి అనంతరం ప్రధాని నెహ్రూ నేడు ఇక్కడ నుంచి తిరిగి ఢిల్లీ వెళ్ళిపోయారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ కుమారి పద్మజానాయుడు, శ్రీ నెహ్రూ మేనకోడలు శ్రీమతి చంద్రలేఖ మెహతా ఆయనతో ఉన్నారు ఇందిరా గాంధీ మరికొన్ని రోజులు ఇంకా డెహ్రాడూన్‌లోనే ఉంటారట.

సమకాలికులలో ఉత్తమోత్తమ వ్యక్తి
ప్రధాని నెహ్రూకు బ్రిటిష్ పత్రిక జోహార్లు

లండన్, నవంబర్ 15

ఇచ్చటి వామ పక్ష వార పత్రిక సైన్ డ్యూస్ న్యూస్ ప్రధాని నెహ్రూను జన్మదినోత్సవ సందర్భంలో అభినందిస్తూ "సమకాలిక భారతీయ నాయకోత్తములలో ఒకడు. ప్రపంచ పౌరులలో అత్యుత్తముడు" అని వర్ణించింది.

"ఈ సమయంలో ఆయనపై తీవ్రమైన విమర్శలు చేయబడుతున్నాయి. అగ్రరాజ్య కూటాలు రెండింటితోనూ స్నేహాన్ని పెంపొందించు కుంటూ ఏ కూటంలోనూ చేరకుండా ఆయన అనుసరించే విధానం భారత దేశానికీ, ప్రపంచానికీ చాలా లాభకరమైనదని మా విశ్వాసం" అని కూడా ఈ పత్రిక వివరించింది.

ప్రపంచంలోని రెండు వర్గాలూ సహజీవన విధానాన్ని అనుసరించడంపైనే నాగరికత మనుగడ ఆధారపడి ఉందనీ. ప్రస్తుతం ప్రపంచంలో ఉద్రిక్తత సడలిన సూచనలు కన్పించడానికి ఆసియా ఖండంలో బలీయమైన భారత దేశం అనుసరిస్తున్న విధానమే కారణమనీ ఆ పత్రిక వర్ణించింది.

కానుకల పరంపర

న్యూఢిల్లీ, నవంబర్ 15

ప్రధాని నెహ్రూ జన్మదినోత్సవ సందర్భంగా జాతీయ వికాస కేంద్రాలలోని ప్రజలు 1600 పైగా శిశు విహార కేంద్రాలు, ఉద్యాన వనాలు, ఆటస్థలాలు, గ్రంథాలయాలు, మహిళా మండలులను కానుకలుగా ఆయనకి సమర్పించారు.

కానుకలుగా సమర్పించిన ఉద్యాన వనాలు, శిశు విహార కేంద్రాలు మొదలైన వాటిలో రాష్ట్రాల వారీగా వివరాలు ఈ విధంగా ఉన్నాయి: రాజస్థాన్ 600, ఉత్తర ప్రదేశ్ 308, పంజాబ్ 177, కేరళ 157, పుదుచ్చేరి 100, బొంబాయి 84, ఒరిస్సా 26, అస్సామ్ 18, నేఫా 12, హిమాచల ప్రదేశ్ 11, అండమాన్, నికోబార్ దీవులు 1.

ఇతర కానుకలలో ఇవి ఉన్నాయి: 631 పాఠశాలలు, 966 ఎకరాల భూమి, కొత్త పాఠశాలలు, తదితర కార్యక్రమాలకుగాను రూ. 26,67,699 నగదు విరాళాలు

సమాజ వికాస కేంద్రాలలోని ప్రజలు పిల్లల పేట 2 లక్షల రూపాయల సేవింగ్స్ సర్టిఫికేట్లు కొన్నారు. పిల్లల ప్రయోజనం కోసం గ్రామీణ జీవిత భీమా పథకం క్రింద 50 లక్షల రూపాయలు పెట్టుబడికూడా పెట్టారు.

అంతర్విశ్వ విద్యాలయ యువజనోత్సవం
మైసూరులో సన్నాహాలు

న్యూఢిల్లీ, నవంబర్ 15

ఆరవ అంతర్ విశ్వవిద్యాలయ యువజనోత్సవం మైసూరులో డిసెంబర్ 2వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు జరుగనున్నది. మొత్తం 35 విశ్వవిద్యాలయాల నుంచి 1500 మంది విద్యార్థులు ఉత్సవంలో పాల్గొంటారు. యువజనోత్సవాన్ని పూర్తిగా ఒక యూనివర్శిటీ నిర్వహించటం ఇదే ప్రథమం. లోగడ జరిగిన అయిదు యువజనోత్సవాలు న్యూఢిల్లీలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అధ్వర్యాన జరిగాయి. ఉత్సవం ఖర్చులను విద్యా మంత్రిత్వ శాఖ వారు భరిస్తారు. మైసూరు యూనివర్శిటీ ఆవరణలో ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ చురుకుగా సాగుతున్నాయి.

ప్రపంచ శాంతికి శ్రీ నెహ్రూ కృషి
వివిధ దేశాల నుంచి రాజకీయ నాయకుల అభినందన సందేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 14

ప్రధాని నెహ్రూ 71 వ జన్మదినోత్సవ సందర్భంగా వివిధ ప్రపంచ దేశాల నాయకులు, రాజకీయజ్ఞులు ఆయనను అభినందిస్తూ ఆయన చిరకాలం భారతీయులకు నాయకత్వం వహిస్తూ భారత దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించటానికి, ప్రపంచ శాంతి వర్ధిల్లటానికి కృషి చేస్తారని ఆశాభావం ప్రకటించారు.

చైనా ప్రధాని చౌఎన్-లై తమ సందేశంలో ఇలా అన్నారు: "మీ జన్మదినోత్సవ సందర్భంలో మిమ్మల్ని హృదయ పూర్వకంగా అభినందించి, మీకు ఆయురారోగ్యాభివృద్ధి కలగాలని కోరుతున్నాను మీరు మీ సంపూర్ణ శక్తితో, విశేష ప్రజ్ఞతో భారత దేశ స్వాతంత్ర్యాన్ని, అభివృద్ధిని, శక్తిని, ఇండియా, చైనాల మధ్య స్నేహ సంబంధాలను, మరింత దృఢపరచడానికి ఆసియాలోను, ప్రపంచంలోను శాంతి వర్ధిల్లేట్టు చేయటానికి కృషి చేయగలరని ఆశిస్తున్నాను."

ప్రధానికి అభినందన సందేశాలు పంపిన ఇతర రాజకీయ వేత్తలలో ఈ క్రిందివారు ఉన్నారు: బర్మా ప్రధాని జనరల్ నే విన్, ఐక్యరాజ్య సమితి ప్రధానకార్యదర్శి డాగ్ హేమర్ షెల్డ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు డిగాల్, స్విస్ ఫెడరేషన్ అధ్యక్షుడు హెన్రిచ్ ల్యూబెక్, పాల్ క్లాడెట్, జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్ అధ్యక్షుడు డాక్టర్ అడినోవర్, ఆస్ట్రియన్ రిపబ్లిక్ అధ్యక్షుడు జూలియస్ రాబ్, జోసెఫ్ సిరాంక్విచ్, జర్మనీ విదేశాంగ మంత్రి వాన్ బ్రెంటానో, చెకోస్లావేకియా ప్రధాని విలియం సిరోకి, లెబనాన్ ప్రధాని రషీద్ కరామి, వియత్నాం ప్రధాని న్గోదిన్ డయ్యం, స్వీడన్ ప్రధాని టాగే ఎర్లండర్,

(మిగతా 4వ పేజీలో)

ప్రధాని పదవి: నెహ్రూ అభిప్రాయాలు

న్యూయార్క్, నవంబర్ 15

ప్రధాని పదవిని వదులుకొన్నట్టయితే అదితనకీ, భారత దేశానికి కూడా మంచిదని శ్రీ నెహ్రూ నేటి రాత్రి అన్నారు.

శ్రీ నెహ్రూ జన్మదినోత్సవం సందర్భంగా "నెహ్రూ చిత్రం" అనే పేరుతో ఈరోజు రాత్రి ఇక్కడ ప్రసారం చేయబడిన టెలివిజన్ ఇంటర్‌వ్యూలో ఆయన పై అభిప్రాయాన్ని ప్రకటించారు.

శ్రీ అర్నాల్డ్ మైకెలిస్ ప్రధానిని ఇంటర్‌వ్యూచేయగా అది రికార్డుచేయబడింది. ఈ ఇంటర్‌వ్యూలో శ్రీ నెహ్రూ జీవితం, వ్యక్తిత్వం, ఆలోచనలు, ప్రపంచంలో ఇండియా నిర్వహించ వలసిన పాత్ర గురించి ఆయన అభిప్రాయాలపై అనేక ప్రశ్నలు అడగటం జరిగినది.

మీరు రిటైర్ కాదలచుకొన్నారా అన్న ప్రశ్నకు శ్రీ నెహ్రూ ఇలా సమాధాన మిచ్చారు: "ప్రస్తుతంకాని, అచిర భవిష్యత్తులో కాని రిటైర్ కావాలని నేను అనుకోవటం లేదు. నేను రిటైర్ అవుతానని అంటున్నానంటే ప్రజా కార్యక్రమాల నుంచి విరమించుకొంటానని అర్థం కాదు. కాని నేను ప్రధాని పదవి నుంచి తప్పుకోవటం నాకు, దేశానికికూడా మంచిదని తప్పక అనుకొంటున్నాను."

నవ్వుతూ ఆయన ఇంకా ఇలా అన్నారు: "నేను ప్రధాని పదవిలో ఉండనప్పటికీ ఇండియాకు నేను ముఖ్యమైన వాడినని తెలుసు గనుక నేను ఎంతో గర్విస్తున్నాను."

బరోడాలో జనసంఘం ప్రదర్శనలు

బరోడా, నవంబర్ 15

చైనా దురాక్రమణదారుల్ని గెంటివేయాలన్న దినాన్ని పురస్కరించుకొని భారతీయ జనసంఘం వలంటీర్లు నేడు ఇక్కడ నగర వీధులలో సైకిళ్ల పై ప్రదర్శనలు జరిపారు.



శ్రీ సాధుసుబ్రహ్మణ్యం 60వ జన్మదినోత్సవం

హైద్రాబాద్, నవంబర్ 15

సర్వోదయ నాయకుడు శ్రీ సాధు సుబ్రహ్మణ్యంగారి 60వ జన్మదినోత్సవం నేడు గాంధీభవన్‌లో సాయంత్రం 5 గంటలకు జరిగింది. ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డిగారు అధ్యక్షత వహించారు.

5 నుంచి 6 గంటల వరకు సూత్రయజ్ఞం జరిగినది.

ప్రార్థనానంతరం శ్రీ డి. సంజీవయ్య, నళకర్ జీ, శ్రీ ఉమ్మెత్తల కేశవరావు, ఆచంట లక్ష్మీపతిగార్లు ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని నిర్మాణ సంస్థల తరపున అనేక మంది కార్యకర్తలు ఉత్సవంలో పాల్గొన్నారు.

మీరట్ సమావేశాలు సమాప్తి
తీర్మానం ఏదీ లేదు

మీరట్, నవంబర్ 15

ఆరు రోజులుగా ఇక్కడ జరుగుతున్న కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు నేటితో ముగిశాయి.

ప్రస్తుత రాజకీయ పరిస్థితి దృష్ట్యా పార్టీ అనుసరించవలసిన వైఖరికి సంబంధించి శ్రీ మాకినేని బసవపున్నయ్య సమర్పించిన సుదీర్ఘమైన రిపోర్టుపై కౌన్సిల్ సభ్యులు నేడు 4 గంటల పాటు చర్చ జరిపారు. అయితే తీర్మానం ఏదీ జరగలేదు.

రిపోర్టుపై శ్రీయుతులు నంబూద్రిపాద్, పి. సి. జోషీ, రణదివే, భూపేష్‌గుప్తా గార్లతోపాటు ఇతర సభ్యులు అనేక మంది మాటాడిన తర్వాత కేంద్ర కమిటీ త్వరలో సమావేశమై అన్ని ప్రజాస్వామ్య వర్గాల నుంచి అభివృద్ధి నిరోధక శక్తులను వేరు చేయటంలో పార్టీ అవలంబించవలసిన మార్గాన్ని నిర్దేశించాలని కౌన్సిల్ సిఫారు చేసినది.

నానక్ జన్మదినోత్సవం
ఢిల్లీలో సిక్కుల ఊరేగింపు

న్యూఢిల్లీ, నవంబర్ 15

సిక్కు మత సంస్థాపకుడు గురు నానక్ జన్మదినం ఈ రోజున ఇక్కడ అత్యంత వైభవోపేతంగా జరిగినది. రాజధాని లోని గురుద్వారాల వద్ద లక్షల కొలది సిక్కులు గుమిగూడి ఉత్సవంలో పాల్గొన్నారు.

ఢిల్లీ వీధులలో మైలు పొడుగునా పెద్ద ఊరేగింపు జరిగినది. అకాలీ దళ నాయకుడు శ్రీ తారాసింగ్ గాంధీ గ్రౌండ్స్ వద్ద సమ్మేళనంలో ప్రసంగించారు.

అత్యవసర సమయాలలో రిజర్వు దళాలు

న్యూఢిల్లీ, నవంబర్ 14

అత్యవసర పరిస్థితులలో జనశక్తి సేకరణకు భారత ప్రభుత్వం ఒక పథకం ప్రకటించింది.

శాశ్వతోద్యోగం చేసి విరమించిన, లేక విడుదలైన కమిషన్డ్ ఆఫీసర్లు, రాష్ట్ర దళాల ఆఫీసర్లు, ఎన్. సి. సి. లోని 'సి' సర్టిఫికేటు పొందిన సీనియర్ సభ్యులు, నిర్దిష్ట వయో పరిమితిలోని ఇతర సివిలియన్ టెక్నీషియన్లు అంతా రిజర్వు సైనిక దళాలలో పేర్లు నమోదు చేయించుకోడానికి అర్హులు. దరఖాస్తు ఫారాలు సబ్ ఏరియా కమాండు ఆఫీసులలోను, బ్రిగేడ్ కార్యాలయాలలోను దొరుకుతాయి. దరఖాస్తులు పూర్తి చేసి, తిరిగి ఆయా కార్యాలయాలకే పంపాలి. శిక్షణకు పిలువబడిన దరఖాస్తు దారులు హోదాకు తగిన పూర్తి జీతాలకు, అలవెన్సులకు అర్హులు. ఇదిగాక వార్షిక నిలుపుదల రుసుములకు కూడా వారు అర్హులు. సివిలియన్లకు వార్షిక నిలుపుదల రుసుము యిస్తారనీ, అవసరం లేని సమయాలలో వారికి యూనిఫారం అవసరం లేదనీ పత్రికా ప్రకటనలో తెల్పారు.

బాష్పవాయు ప్రయోగానికి నిరసన

బాలాసోర్ (ఒరిస్సా), నవంబర్ 14

కటక్‌లో పండిట్ పంత్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపిన వారిపై పోలీసులు బాష్పవాయు ప్రయోగించినందుకు నిరసనగా ఫకీర్ మోహన్ కాలేజి విద్యార్థులు సుమారు 600 మంది నేడు హర్తాల్ చేశారు.

ఆసియా దేశాలలో జనాభా పెరుగుదల
నానాటికీ తీవ్ర మౌతున్నదని
కొలంబో రాజ్యాల సభ హెచ్చరిక

జోగ్జకార్తా, నవంబర్ 14

కొలంబో పథకంలోని సభ్య రాజ్యాలు కొన్నిటిలో జనాభా పెరుగుదల వల్ల అనేక క్లిష్ట సమస్యలు ఉత్పన్నమౌతున్న విషయాన్ని గుర్తించాలని ఇక్కడ జరుగుతున్న కొలంబో రాజ్యాల సమావేశం నేడు హెచ్చరించింది.

ఈ సభలో ప్రతిపాదించబడిన వార్షిక నివేదికలో ఈ విషయం వెల్లడించబడింది. తలసరి ఆదాయపు దామాషా పెరుగుదలకంటె జనాభా దామాషా పెరుగుదల ఎక్కువగా ఉండడంవల్లనూ ఉద్యోగాలను కోరేవారి సంఖ్య ఉద్యోగావకాశాలకంటె ఎక్కువగా ఉండడం వల్లనూ అనేక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని ఈ నివేదిక వెల్లడించింది.

మూడు వారాలపాటు జరిగిన ఈ సభ కృషిని సమీక్షిస్తూ ఇండోనీషియా ప్రతినిధి 'ఆకలి' ఆసియా రాజ్యాలను ఎదుర్కొంటున్న ప్రథమ సమస్య అని వివరించారు. శారీరకంగా వాని కలిగించడమేకాక, కోట్ల కొలది ప్రజలు ఆకలితో ఉండడం ప్రపంచ చరిత్రగతిని తారుమారు చెయ్యగల బలీయమైన శక్తిగా కూడా ఉంటుందని ఆయన అన్నారు. కొలంబో దేశాల అభివృద్ధికి ఇతర రాజ్యాల నుంచి వస్తున్న సహాయం వృద్ధి అవుతున్నదని కూడా ఆయన అన్నారు. ఈ పథకం ప్రారంభ మైనప్పటి నుంచి 600 కోట్ల డాలర్ల సహాయం లభించిందనీ, అంతర్జాతీయ బ్యాంక్ మరో 93 1/2 కోట్ల డాలర్లను లభింపజేసిందనీ ఆయన అన్నారు. ఈ దేశాల ఆర్థిక వసతులు అవసరాలకు మించి పెరగడం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనదనీ, కొలది కాలంలో పెట్టుబడి ధనాన్ని సమకూర్చుగోనగల స్థితి వీనికి రాగలదనీ ఆయన అన్నారు.

సంయుక్త రక్షణ ఒడంబడిక పాక్ విదేశాంగ మంత్రి వివరణ

ఢాకా, నవంబర్ 14

ఇండియాతో సంయుక్త రక్షణ ఏర్పాట్లు చేసుకోవటానికి పాకిస్తాన్ ప్రతిపాదన చేసినదని, ఆ ప్రతిపాదనకు ఇండియా సుముఖత్వాన్ని ప్రకటించి, అలాటి ఏర్పాటు కుదిరిన పక్షంలో అది ఒక ద్వైపక్ష ఒడంబడిక రూపంలో ఉండగలదని పాక్ విదేశాంగ మంత్రి శ్రీ మంజూర్ ఖాదిర్ నిన్న రాత్రి ఇక్కడొక సమావేశంలో అన్నారు.

అలాటి ద్వైపక్ష ఒడంబడిక వల్ల సెంటో (పూర్వపు బాగ్దాద్ కూటమి) లోకాని, సీటోలో కాని పాకిస్తాన్ సభ్యత్వంలో మార్పేమీ రాదని ఆయన స్పష్టం చేశారు.

యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థుల సమావేశంలో ప్రసంగిస్తున్న సమయంలో శ్రీ ఖాదిర్ పై విధంగా అన్నారు. పాక్ ప్రభుత్వం తలపెట్టిన ప్రాథమిక ప్రజాస్వామిక సంస్థలకు ఇచ్చిన వివరిస్తూ శ్రీ ఖాదిర్ గత మూడు రోజులుగా ఉపన్యాసాలు చేస్తున్నారు.

కాశ్మీర్ సమస్యను పరిష్కరించటానికి మన ప్రభుత్వం కొన్ని చర్యలు గైకొంటున్నదని ఆయన అన్నారు. కాని ఆ చర్యలేమిటో ఆయన వివరించలేదు.

టిబెట్ జాతి విధ్వంసనకు కుట్ర

చైనాపై దలైలామా పునరారోపణ

ముస్సోరీ, నవంబర్ 14

టిబెట్ జాతి విధ్వంసనకు చైనా పూనుకొన్నదనీ, టిబెట్‌లో మానవ హక్కులను మంటగలిపిందనీ చైనాపై దలైలామా నేడు తిరిగి ఆరోపించారు. దీనిని అరికట్టడానికి నైతిక, న్యాయ శక్తులను వినియోగించడం తప్ప వేరు మార్గం లేదనికూడా ఆయన అన్నారు.

అంతర్జాతీయ న్యాయ నిపుణుల బృందం ఏర్పాటు చేసిన న్యాయ విచారణ సంఘానికి దలైలామా సమర్పించిన నివేదికలో ఈ విషయాలను వెల్లడించారు. టిబెట్ జాతిని నాశనం చేయడానికి టిబెట్ స్త్రీ, పురుషులపై సంతాన నిరోధక పద్ధతులను అవలంబిస్తున్నారని కూడా ఆయన వెల్లడించారు. ఈ విధంగా సంతాన నిరోధక చర్యలకు గురిచెయ్యబడ్డవారు పదిమంది అచ్చటినుంచి వచ్చిన శరణార్థులలో ఉన్నారనికూడా దలైలామా వెల్లడించారు. టిబెట్ జాతీయులైన పిల్లలను చైనా పంపివేయడం జరుగుతున్నదని ఆయన అన్నారు.

విద్యా విషయిక సమాచార సేకరణ

విద్వద్గోష్ఠిలో శ్రీ కిర్పాల్ ప్రారంభోపన్యాసం

న్యూఢిల్లీ, నవంబర్ 15

విశ్వవిద్యాలయాలనుంచి విద్యావిషయిక సమాచారాన్ని సేకరించడానికి అనుసరించవలసిన పద్ధతులను సప్రమాణమైన కార్యక్రమాన్ని రూపొందించే విషయమై కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన అఖిల భారత విద్వద్గోష్ఠిని భారత ప్రభుత్వం సంయుక్త విద్యా సలహాదారు శ్రీ పి. యన్. కిర్పాల్ ప్రారంభించారు. మూడు రోజులపాటు జరుగగల యీ విద్వద్గోష్ఠిలో పాల్గొంటున్న 20 విశ్వవిద్యాలయాల ప్రతినిధుల నుద్దేశించి ప్రసంగిస్తూ, జాతీయ పునర్నిర్మాణ ప్రణాళికలను ప్రభుత్వ విధానాలను నిర్ణయించడంలో యీ విద్యా విషయక సమాచారం సేకరణ ఎంతో ప్రయోజనకారిగా ఉండగలదని అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్య సిద్ధి అనంతరం జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమం ప్రారంభంగా సాగిపోతోందనీ, ప్రజాస్వామ్యాన్ని జయప్రదం చేయడమే కాకుండా జాతీయ సమైక్య సాధనకు, ఆర్థిక శ్రేయస్సాధనకు కృషి చేయడమే దేశం యొక్క ప్రధాన కర్తవ్యమనీ, యీ కృషిలో విద్య అమోఘమైన పాత్రను నిర్వహించవలసి వుందనీ, అందుకనే ఉన్నత ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని విపులమైన ప్రాతిపదికపై విద్యావ్యాప్తికి తగు పథకాలను భారత ప్రభుత్వం అమలుజరుపుతుందని సమగ్ర జాతీయ అభ్యుదయ సాధన కృషిని జయప్రదం కావాలంటే వాస్తవ సమాచారం పూర్తిగా తెలియాలని, ఇందుకు అవసరమైన విధానాలను రూపొందించడంలో యీ విద్వద్గోష్ఠి మార్గదర్శకం కాగలదని శ్రీ కిర్పాల్ అన్నారు. సుశిక్షితులైన సాంకేతిక నిపుణుల కొరతను తీర్చడం కోసం విద్యా సంస్థలతో శిక్షణ సౌకర్యాలను కల్పించాలని కూడా ఆయనన్నారు. నేటి చర్చలలో అలీఘర్, ఆంధ్ర, బెనారస్, బరోడా, బీహార్, బొంబాయి, ఢిల్లీ, గోరఖ్‌పూర్, గుజరాత్, జబల్‌పూర్, జమ్మూ-కాశ్మీర్, కర్ణాటక, మద్రాసు, పంజాబు, పూనా, రాజస్థాన్, రూర్కీ, నాగపూర్, ఎస్. ఎస్. డి. టి, మహిళా విద్యాలయం, విశ్వభారతి విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఢిల్లీలో పిల్లల షికారు రైలుబండి

న్యూఢిల్లీ, నవంబర్ 15

శిశు దినోత్సవం నాడు అంటే యీ నెల 14వ తేదీని భారత రాజధానిలోని బాలలకు షికారు రైలుబండి ప్రత్యేక ఆకర్షణ. ఆ రైలుబండిని ప్రవేశపెట్టి నిన్నటికి ఒక ఏడాది నిండింది.

ఆ సందర్భంలో బాలభవన్ మండలి యీ రైలు బండిని ఎక్కువ సేపు అంటే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నడిపిరది.

ఆ నాడు పిల్లల వద్ద నుంచి ప్రత్యేక రాయితీ ఛార్జి అంటే 5 నయాపైసలు మాత్రమే వసూలు చేస్తారు. 15 ఏళ్ళకు మించని వయస్సుగల బాలలకే యిందులో ప్రవేశం వుంటుంది.

బాలల రైల్వేకు ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ 1958 నవంబర్ 14న ప్రారంభోత్సవం జరిపారు. అప్పటి నుంచి యింతవరకూ దాదాపు 50 వేల మంది బాలలు అందులో షికారు వెళ్ళారు. ఈ చిన్న రైలు బండి యింజను పొడవు 25 అడుగులు. బరువు 8.6 టన్నులు.

ఈ రైలింజనును జాలాలోకోమోటివ్, ఇంజనీరింగు కంపెనీ లిమిటెడ్ వారు బహూకరించారు. దానికి తగిలించి రెండు రైలు పెట్టెలనూ ఉత్తర రైల్వే వారు తమ అమృతసర్ కార్ఖానాలో ఉత్పత్తి చేశారు. అందులో మొత్తం 50 మంది కూర్చోడానికి చోటు వుంది.

బాలభవన్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్వయం నిర్ణయాధికారంగల సంస్థ 6-14 ఏళ్ళ మధ్య వయస్కులైన బాలలకు వ్యాయామ, వినోద కార్యక్రమాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించడమే యీ సంస్థ ఆశయం.

ఇండియా, చైనా సరిహద్దు వివాదంపై హెర్టర్ వైఖరి

వాషింగ్టన్, నవంబర్ 13

అమెరికా విదేశాంగ కార్యదర్శి శ్రీ క్రిస్టియన్ హెర్టర్ నేడు భారత దౌత్య వ్యవహార కార్యాలయానికి వచ్చి ఇండియా, చైనా సరిహద్దు వివాదాన్ని గురించి నిన్న తాము చేసిన ప్రకటనను స్పష్టీకరించారు.

తర్వాత విదేశాంగ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో చైనా చర్యలు అమెరికాకు ఎంతో ఆగ్రహాన్ని కల్గించినవని చెప్పినట్లు తెల్పబడింది (ఇండియా, చైనా వివాదంలో అమెరికా ఎవరి పక్షాన్ని వహించటం లేదని హెర్టర్ నిన్నఅన్నారు.)

హెర్టర్ ప్రకటన ఇలా అపోహలకు దారి తీయటం చాలా విచారకరమైన విషయమని అమెరికా విదేశాంగ శాఖ ఆర్థిక వ్యవహారాల సహాయ కార్యదర్శి శ్రీ థామస్ సి. మ్యాన్. అన్నారు. ఇండియాకు 23 కోట్ల 83 లక్షల రూపాయలు విలువ చేసే గోధుమలు, గోధుమ పిండి అమ్మకానికి కుదుర్చుకొన్న ఒడంబడికపై సంతకం చేసే సమయంలో ఆయన అలా అన్నారు.

ఇండియా స్వాతంత్ర్యానికి, ప్రాంతీయ ఐక్యతకు భంగం కల్గరాదని అమెరికా ఎప్పుడూ కోరుతూ ఉంటుందని శ్రీ మ్యాన్ అన్నారు.

సెప్టెంబర్‌లో 23982 మందికి ఉద్యోగాలు

ఉద్యోగ సాధక కార్యాలయాల కృషి

న్యూఢిల్లీ, నవంబర్ 15

1959 సెప్టెంబర్ నెలలో 23,982 మంది అభ్యర్థులకు ఉద్యోగ సాధక కార్యాలయాల ద్వారా ఉద్యోగాలు లభించాయి. అంతకు ముందు నెలలో వీటి ద్వారా ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య 24,080. అంటే సమీక్షా కాలంలో ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య అంతకు ముందు నెలలో కంటె కొద్దిగా అంటే 88 తక్కువ. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించగా, మద్రాసు, పంజాబ్, బీహార్ రాష్ట్రాలలో యీ తగ్గుదల కన్పించింది.

సెప్టెంబర్ నెలలో కేంద్ర ప్రభుత్వ కొలువులో 4480 మందికీ, రాష్ట్ర ప్రభుత్వాల కొలువులో 13,333 మందికీ, ప్రభుత్వ సహాయం పొందే సంస్థలోనూ, స్థానిక సంస్థలోనూ 3,477 మందికీ, మిగిలిన వారికి యితర యజమానుల వద్దా ఉద్యోగాలు లభించాయి.

ఆగస్టు నెలలో 3278 మంది యజమానులు ఈ కార్యాలయాల సహాయాన్ని పొందగా, సమీక్షా కాలంలో 3,843 మంది యజమానులు యీ కార్యాలయాల సహాయాన్ని పొందారు. సెప్టెంబర్ నెలలో వారు 33493 ఖాళీలను యీ కార్యాలయాలకు తెలియచేశారు. ఆగస్టు నెలలో కంటే యీ సంఖ్య 12 తక్కువ.

సమీక్షా కాలంలో 228413 మంది అభ్యర్థులు తమ పేర్లను యీ కార్యాలయాలలో నమోదు చేసుకున్నారు. ఆగస్టు నెలలో 218309 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అంటే 10108 మంది ఎక్కువ అన్నమాట.

ఉద్యోగాలు కోరుతూ యీ కార్యాలయాలలో తమ పేర్లను నమోదు చేసుకున్న అభ్యర్థుల మొత్తం సంఖ్య 1959 సెప్టెంబర్ నెలాఖరుకు 1408907 అంతకు ముందు నమోదు నాటి సంఖ్య కంటే యిది 31803 ఎక్కువ.

సోవియట్ రష్యా స్కాలర్‌షిప్పులు

న్యూఢిల్లీ, నవంబర్ 15

సోవియట్ రష్యాలో 1959-60వ సంవత్సరంలో పోస్టు గ్రాడ్యుయేటు విద్యాభ్యాసాన్ని లేదా పరిశోధనలను సాగించడానికి సోవియట్ రష్యా ప్రభుత్వం ప్రకటించిన స్కాలర్‌షిప్పులకు క్రింది వారిని నిర్ణయించడమయిందని కేంద్ర శాస్త్ర పరిశోధనల, సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రతికా ప్రకటనలో తెలియజేసింది:

శ్రీ రామ్‌కిషోర్ చౌదరి (ఖగోళ విజ్ఞానం) శ్రీ సరోజ్ చంద్ర శ్రీవాత్సవ (రసాయన శాస్త్రం) శ్రీ సుధీంద్ర నాథ్ భట్టాచార్య (రసాయనశాస్త్రం) శ్రీ బటుకేశ్వర్ దత్ (భూగర్భశాస్త్రం) శ్రీ మహీంద్ర నాథ్ మోహన్ రావు (భౌతిక విజ్ఞానం) శ్రీ చంద్రదత్ భారీయాల్ (కెమికల్ ఇంజనీరింగు) శ్రీ ప్రసన్‌కుమార్ ముఖోపాధ్యాయ (ఆయిల్ ప్రొసెసింగు) శ్రీ కైలాస్ కుమార్ మిశ్రా (మెకానికల్ ఇంజనీరింగు టెక్నాలజీ).

స్కాలర్ షిప్పుల వ్యవహారాలను న్యూఢిల్లీలోని కేంద్ర శాస్త్ర పరిశోధన, సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ చూస్తోంది.

సరిహద్దు సమస్యపై ప్రభుత్వ వైఖరి

కమ్యూనిస్టు పార్టీ సమర్థన: డాంగే ప్రభృతులపై అభిశంసన

మీరట్, నవంబర్ 14

ఇండియా, చైనాల మధ్య సరిహద్దుగా ఈశాన్య ప్రాంతంలో మాక్‌మోహన్ రేఖనూ, పశ్చిమ ప్రాంతంలో సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న సరిహద్దునూ గుర్తించాలన్న భారత ప్రభుత్వ వాదాన్ని సమర్థిస్తూ కమ్యూనిస్టు పార్టీ నేడిక్కడ తీర్మానించింది.

పశ్చిమ సరిహద్దు రేఖ స్పష్టంగా నిర్ణయింప బడనందున ఈ విషయాన్ని సమాలోచనలద్వారా పరిష్కరించుకొనాలని కూడా పార్టీ తీర్మానించింది. ఈ సరిహద్దులను నిర్ణయించేటప్పుడు రాజకీయంగానూ, పరిపాలనా విషయంగానూ ఉన్న వాస్తవ స్థితిని గమనించాలనికూడా తీర్మానించబడింది.

షరతులు విధించరాదు!

సమాలోచనలను ప్రారంభించడానికి షరతులను ఏ పక్షమూ విధించరాదనీ, బేషరతుగా సమాలోచనలకు పూనుకోవాలనీ పార్టీ తీర్మానించింది. నూతన ప్రతిపాదనలను చేయడంలో చైనా ప్రధాని ప్రదర్శించిన వైఖరి పట్ల పార్టీ హర్షాన్ని వెలిబుచ్చింది. మాక్‌మోహన్ రేఖ పుట్టు పూర్వోత్తరాలను గురించి ఎటువంటి అభ్యంతరాలున్నప్పటికీ, ఈ రేఖ ఇండియా, చైనాల సరిహద్దుగా అనేక సంవత్సరాల నుండి గుర్తించబడిందనీ, ఈ రేఖకు దక్షిణంగా ఉన్న ప్రాంతం భారత ప్రభుత్వపాలనలో ఉందనీ, అందువల్ల ఈ రేఖను చైనా గుర్తించాలనీ పార్టీ తీర్మానించింది.

లడక్ సరిహద్దు

లడక్ ప్రాంతంలో సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న సరిహద్దును చైనా గుర్తించాలన్న భారత ప్రభుత్వ వైఖరిని పార్టీ సమర్థించింది. అయినప్పటికీ ఈ సరిహద్దు స్పష్టంగా లేదు కనుక ఈ వివాదాన్ని సమాలోచనల ద్వారా పరిష్కరించుకోవాలని పార్టీ తీర్మానించింది. ఈ సందర్భంలో పాలనా దృష్ట్యానూ, రాజకీయ దృష్ట్యానూ ఉన్న వాస్తవ పరిస్థితులను ఉభయ ప్రభుత్వాలు గుర్తిస్తే పరిష్కారం సులభ సాధ్యమని పార్టీ అభిప్రాయపడింది.

చైనా దురాక్రమణ చేయలేదు!

చైనా దురాక్రమణ చేసిందన్న విషయాన్ని పార్టీ తన తీర్మానంలో ప్రస్తావించలేదు. తూర్పు ప్రాంతంలో సరిహద్దును ఉభయ పక్షాలు గుర్తించలేక పోవడం, పశ్చిమ ప్రాంతంలో సరిహద్దు స్పష్టంగా గుర్తించబడక పోవడం దురదృష్ట కరమనీ, అందువల్ల చైనా దురాక్రమణ చేసిందని ఆరోపించడంలో అర్థం లేదనీ ఈ పార్టీ తీర్మానించింది. చైనా పట్ల వ్యతిరేక భావాన్ని రగుల్గొల్పుతూ జనసంఘ్ స్వతంత్ర పార్టీ, పి. యస్. పి. నాయకత్వం, జనసంఘం ప్రయత్నిస్తున్నాయని ఈ తీర్మానం నిందించింది.

డాంగేపై అభిశంసన

సరిహద్దుల విషయంలో పార్టీతో తమకు కలిగిన అభిప్రాయభేదాలను బహిరంగంగా ప్రకటించినందుకు పార్టీ శ్రీ డాంగేను అభిశంసించింది. శ్రీ సర్దేశాయిని కూడా అభిశంసించి ఇక ముందు ఈ కార్యక్రమాలు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటారన్న ఆశాభావాన్ని పార్టీ ప్రకటించింది. శ్రీ మిరాజ్‌కర్‌పై కూడా ఇటువంటి తీర్మానమే చేయబడింది. సంయుక్త మహారాష్ట్ర సమితి చేసిన పార్టీ వ్యతిరేక తీర్మానంలో భాగ

భిలాయ్ ఉక్కు కర్మాగారం నిర్మాణంలో మూడవ దశ

న్యూఢిల్లీ, నవంబర్ 15

భిలాయ్ ఉక్కు కర్మాగారంలో ఉక్కు కడ్డీల యంత్రం పని ప్రారంభించడంతో ఈ కర్మాగారపు నిర్మాణం మూడవ దశకు చేరుకుంది. ఈ దశతో దీని నిర్మాణం పూర్తి అవుతుంది.

గడచిన ఫిబ్రవరి మాసంలో రాష్ట్రపతి రుక్కు తయారు ఉత్పత్తికి ప్రారంభోత్సవం జరపడంతో దీని నిర్మాణం మొదటి దశకు చేరుకుంది. అక్టోబర్ 12 వ తేదీన ఉక్కు ఉత్పత్తి ప్రారంభించడంతో దీని నిర్మాణం రెండవ దశకు చేరుకుంది నాటి నుంచి నేటి వరకూ 350 టన్నుల ఉత్పత్తి ప్రమాణం గల కొలిమి నుంచి ఇప్పటికి 6800 టన్నుల ఉక్కు ముక్కలు ఉత్పత్తయ్యాయి. ఇవి సాధారణ ఉక్కు కడ్డీల యంత్రానికి సరిపడే 'కడ్డీలు'గా తీర్చి దిద్ద బడ్డాయి. ఈ మిగతా కార్యక్రమమంతా డిసెంబర్ మధ్యనాటికిపూర్తికాగలదని, అప్పట్నించీ సంవత్సరాంతంలోగా భారీ ప్రమాణంలో అమ్మకానికి సరుకు విడుదల కాగలదని భావించబడు తున్నది. ఏటా 10 లక్షల టన్నుల ఉక్కు కడ్డీలను ఉత్పత్తి చేయి గలదు.

టెలిగ్రాముల బట్వాడాలో ఆధునిక పద్ధతులు

బుల్లర్, జోన్స్ అండ్ పెరెజ్ అనేకంపెనీలో యజమానులలో జాన్ బుల్లర్ ఒకడు. న్యూయార్కు స్టాక్ ఎక్స్ఛేంజిలో ఆయనసభ్యుడు. ఆయనఆఫీసులో ఒక మూల నున్న టెలిప్రింటర్‌లో గంట గణగణ మన్నది. వెంటనే దాని దగ్గిరకు వెళ్ళి దానిలో టైపు చేయబడుతున్న వార్త చూచాడు. దానిలో ఉన్నదిది. "ట్రిపోలీ ఆయిల్ కంపెనీ శాలుకు 400 షేర్లు కొనవలసింది." శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక క్లయింటు వద్దనుంచి వచ్చిన సమాచారం అది.

బుల్లర్ అది చదువుకొని, స్టాక్ ఎక్స్ఛేంజికి టెలిఫోన్ చేసి, ఆ 400 షేర్లు కొన్నారు. మేరు ఒకటికి 98 డాలర్ల చొప్పున వాటిని తను కొని ఉంచినట్లు ఆ టెలిప్రింటరు ద్వారా ఆయన తిరిగి టెలిగ్రాము పంపాడు.

శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి న్యూయార్క్‌కు ఈ వార్తను పంపినది మొదలుకొని ఆయన తిరిగి సమాధానం పంపిన వరకు పట్టిన మైము ఏడు నిమిషాలు కూడా కాలేదు.

వార్తలను ఆటోమాటిక్‌గా గ్రహించి పంపగల టెలిప్రింటరు ఉన్న ఆఫీసు యజమానికి వేలకొలది మైళ్ళ దూరం నుంచి మూడు నిమిషాల వ్యవధిలో వార్త పంపవచ్చు.

అమెరికాలో ఒకేఒక టెలిగ్రాఫ్ కంపెనీ అయిన వెస్టర్న్ యూనియన్ టెలిగ్రాఫ్ కంపెనీ, గత ప్రపంచ యుద్ధానంతరం టెలిగ్రాఫ్ పద్ధతులను అత్యాధునికం చెయ్యాలని 16 కోట్ల డాలర్ల కార్యక్రమాన్ని తలపెట్టింది. టెలిప్రింటర్ మొదలైన ఆటోమాటిక్ సాధనాలను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమంలో ఒక భాగం. "వార్తలను తక్షణమే అందజేయాలి" ఇదొక్కటే వెస్టర్న్ యూనియన్ లక్ష్యం.

న్యూయార్క్, షికాగో, అట్లాంటా (జార్జియా రాష్ట్రం) నగరాల మధ్య వార్తలను పంపడంకోసం వెస్టర్న్ యూనియన్ కంపెనీ రేడియో మైక్రోవేవ్ పద్ధతిని కూడా ప్రవేశ పెట్టింది. దీని వల్ల నిమిషానికి 2000 టెలిగ్రాములను ఏకకాలంలో అటూ ఇటూ పంపవచ్చు. ఈ పద్ధతి ద్వారా అన్ని నగరాల మధ్య టెలిగ్రాములను పంపాలని వెస్టర్న్ యూనియన్ కంపెనీ లక్ష్యం.

టెలిగ్రాములను అతి శీఘ్రంగా అందజేయటానికి వెస్టర్న్ యూనియన్ అనుసరిస్తున్న మరొక పద్ధతి పేరు డస్క్ ఫ్యాక్స్ సర్వీస్. టెలిప్రింటర్‌లాగే ఈ యంత్రం కూడా టెలిగ్రాములను ఆటోమాటిక్‌గా పంపనూగలదు; స్వీకరించనూగలదు. అయితే టెలిగ్రాం వ్రాయబడిన కాగితాన్ని అచ్చుగుద్దినట్లు లేదా ఫొటో తీసి పంపినట్లు చేస్తుంది ఇది.

టెలిగ్రాం పంపదలచినవాడు దానిని టైపు చేస్తాడు; లేదా చేతితో వ్రాస్తాడు. ఆ కాగితాన్ని డస్క్ ఫ్యాక్స్ యంత్రంలో పెడతారు. ఒక సిలెండరుకు అమర్చబడిన "ఎలక్ట్రిక్ నేత్రం" ఆ వార్తను చూస్తూ తిరుగుతూ ఆ సమాచారాన్ని తంతి ద్వారా గాని, రేడియో ద్వారా గాని మరొక నగరంలో అది ఎక్కడకు వెళ్ళాలో అక్కడున్న యంత్రానికి అందిస్తుంది. ఆ రెండవ యంత్రంలో ఒక కాగితం మీద సమాచారమంతా పడుతుంది.

తిరిగి టైపు చెయ్యటానికి కష్టంగా వుండే రికార్డులను, కోడ్‌లను, లెక్కల సమాచారాలను పంపడానికి ఇది ముఖ్యంగా ఉపయోగపడుతుంది. అమెరికాలో డస్క్ ఫ్యాక్స్ సర్వీస్ ఏర్పాట్లు చేసుకొని వెస్టర్న్ యూనియన్‌కు ఫీజులు కడుతున్న కంపెనీలు 36,000 వరకు ఉన్నాయి.

టెలిప్రింటర్ సర్వీస్‌లో ఇటీవల ఇంకా కొత్త పద్ధతులను ఏర్పాటు చేశారు. ఈ పద్ధతిని 'టెలెక్స్' అంటారు. టెలిప్రింటర్ల వద్ద ఆపరేటర్లు లేకపోయినా సరే, వాటంతట అవి పని చేసే ఏర్పాట్లున్నాయి. ఇదివరలో ఈ పద్ధతి న్యూయార్క్, కెనడాల మధ్య ఉంది; ఇప్పుడు న్యూయార్క్, షికాగోల మధ్య కూడా ఏర్పాటు చేశారు.

వెస్టర్న్ యూనియన్ కంపెనీ ఇతరులకు తమ టెలిగ్రాం తీగలను అద్దెకు కూడా యిస్తాయి. ప్రభుత్వం, పరిశ్రమలు ఈతీగలు అద్దెకు తీసుకొని వాడుకొంటూ ఉంటాయి. ఈ విధంగా అమెరికన్ విమానాశ్రయాలన్నింటినీ కలుపుతున్న తీగల పొడవు 25,000 మైళ్ళు. ప్రయివేటు సంస్థలలో ఇంతగా తీగలు అద్దెకు తీసుకొన్నవి ప్రపంచంలో మరేవీ లేవు.

నేడు సంవత్సరాల క్రిందట టెలిగ్రాములు అందజేయటానికి సుమారు అరంగంట నేపు పట్టేది. ఈ నాడు ఇది సగటున ఏడు నిమిషాలకు తగ్గిపోయింది. ఆటోమాటిక్ యంత్రాలు తీసి ఇళ్ళకు టెలిగ్రాములను స్వయంగా అందజేసే మైమతో సహా సగటున ఏడు నిమిషాలు అవుతున్నది.

అమెరికాలో నూటికి 95 పంతుల టెలిగ్రాములు ఆటోమాటిక్ యంత్రాల ద్వారా అందజేయబడుతున్నవి. క్రిందటి సంవత్సరం ఈ విధంగా 150 కోట్ల పదాలు గల టెలిగ్రాములు అందజేయబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘం

హైద్రాబాద్, నవంబర్ 14

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ వి. బి. రాజు ఈ క్రింది ప్రకటన చేశారు:

"ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి నూతనంగా ఎన్నుకొనబడిన సభ్యులసమావేశం ఈ నెల 21 వ తేదీనిఉదయం 10 గంటలకు గాంధీభవనంలో జరుగుతుంది అఖిల భారత కాంగ్రెస్ సంఘ సభ్యులను ఎన్నుకోడానికి ఈ సమావేశం 22 న కూడా కొనసాగుతుంది.

సభ్యులందరికీ వ్యక్తిగతంగా ఆహ్వానాలు పోస్టులో పంపబడుతున్నాయి ఆ ఆహ్వానాలు అందకపోయిన పక్షంలో ఈ ప్రకటననే ఆహ్వానంగా భావించి తప్పక సమావేశానికి హాజరు కావలెనని కోరబడుతున్నారు. పూర్వపు బాకీలు కానీ, ప్రతినిధి రుసుము కాని చెల్లించనివారు సమావేశం రోజున ఈ సొమ్మును ఆఫీసులో చెల్లించవలసి ఉంటుంది."

ఆంధ్రలో రాజాజీ పర్యటన

కొత్తగూడెం, నవంబర్ 14

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు వచ్చే ఫిబ్రవరి నెలలో పర్యటించనున్నట్లు స్వతంత్ర పార్టీ అధ్యక్షులు ఆచార్య రంగా నేడిక్కడ వెల్లడించారు.

పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, ఇండియా-చైనా సరిహద్దుల వివాదం విషయమై అమెరికా విదేశాంగ మంత్రి హెర్టర్ వెలిబుచ్చిన అభిప్రాయాలకు ఆచార్య రంగా తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరిచారు. మాక్‌మోహన్ రేఖయే ఇండియా-చైనాల సరిహద్దుగా ప్రపంచమంతా గుర్తింపబడి యుండగా, ఈ విషయమై హెర్టర్ వెలిబుచ్చిన అభిప్రాయం ప్రపంచ నిరసనకు పాత్రమైనదన్నారు. చైనా సరిహద్దు సంఘటనలు గురించి యెప్పటికప్పుడు ప్రజలకు తెలియ పరుస్తుండాలని వారు భారత ప్రభుత్వానికి సూచించారు. అలా తెలియపరచకపోవడం ప్రజలయెడ అపచారం జరపడమే నన్నారు.

క్షయవ్యాధి నిరోధానికి పరిశోధనలు ప్రోత్సహించడానికి

సమితి బహుమతుల పథకం

న్యూయార్క్, నవంబర్ 11

క్షయవ్యాధి విషయంలో శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడానికిగాను లక్ష డాలర్ల విలువ గల బహుమతులను ఇవ్వాలని ఐక్యరాజ్య సమితి సాంఘిక సంఘం నేడు నిర్ణయించింది.

వచ్చే 4 సంవత్సరాలలోనూ ఈ బహుమతులను ఇవ్వడానికి తగు ఏర్పాట్లను చేయవలసిందిగా ప్రధాన కార్యదర్శిని కోరుతూ ఒక తీర్మానాన్ని ఈ సంఘం ఆమోదించింది. ఈ బహుమతులను ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సులపై ఇవ్వడం జరుగుతుంది. ఈ పథకం తిరిగి అవసరమైనంత కాలం వరకూ పునరుద్ధరించాలని కూడా ఈ సంఘం సూచించింది.

సంపాదక లేఖలు

మేడిచల్ తాలూకా ప్రజల దురవస్థ

ఆర్యా! మేడిచల్ తాలూకా ఆల్యాబాద్ ప్రాంతము మల్కపేట, యాడాపూర్, పుల్కల్ మొదలగు వాతాగజవెల్లి ప్రాంతము, పొట్కుండ శివన్నగూడెం, సర్వాపురం, తుంకి, బొల్లారం యీ పరిసర గ్రామములు పర్యటనచేసి చూచితిని. ఈ సంవత్సరము వర్షాలు అధికముగా కురిసినందువలన పునాస పంటలు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతాలలో నేత పారిశ్రామికులు అధికముగా ఉన్నారు. వారి స్థితి చాలా అధ్వాన్నముగా ఉన్నది. నేసిన గుడ్డలు సకాలమునకు అమ్ముకోకాక, అమ్మినదానిలో మిగిలినవి తిండిగింజలకు సరిపడక పస్తులు ఉంటు ఉన్నారు. చేనేత సహకార సంఘాలూ అసహాయ స్థితిలోనే ఉన్నాయి. నేత పారిశ్రామికులు నూటికి డెబ్బది అయిదు వంతున యితర కాయకష్టములు చేసి జీవిస్తున్నారు. మిగత ఇరువది అయిదు వంతువారికైన చేతినిండ పని లేక పొట్టనిండ అన్నం, వొంటినిండ బట్ట దొరుకక అన్న మో రామచంద్రా యని అలమటించుచున్నారు. కాబట్టి చేనేతకు చీరెలు, ధోవతులు కేటాయించి చేనేత ప్రజల నాదుకోవాలి.

ఆల్యాబాద్ యి. కూళయ్య.

* * *

'వెదిర' బస్సు స్టేజి

ఆర్యా! కరీంనగరం-నిజామాబాద్ రోడ్డు మీద ఉన్న "వెదిర" కరీంనగరం నుండి రెండవ బస్సు స్టేజి. ఈ స్టేజి నుండి చుట్టుప్రక్కల నుండి దాదాపు 25- 30 గ్రామములు వారు రావటము, పోవటము జరుగుతుంది. ప్రయాణీకుల సంఖ్య క్రమంగా పెరుగుతూ ఉన్నది కాని, బస్సుల్లో సీట్లు ఉన్నంత వరకు మాత్రమే ప్రయాణీకులను తీసుకోవడం జరుగుతున్నది. సాధారణముగా ప్రతి కండక్టర్ ఈ నియమము పాటించటం జరుగుతుంది. ప్రయాణీకులపై అనుగ్రహము కలిగిన పదింట ఒక కండక్టర్ మాత్రమే ఈ నియమాన్ని ఉల్లంఘించటముతో కొందరు ప్రయాణీకులకు సౌకర్యము కలుగుతు ఉంటుంది. పైకారణాల వలన ఉదయము 7 గంటల నుండి నిరీక్షించే ప్రయాణీకులకు సాయంత్రము 5 గంటలకు లేక రాత్రి 8 గంటల వరకు గాని బస్సు దొరకడం లేదు.

కోర్టు పనులున్న వారికి, స్కూల్ పిల్లలకు, మరియు ఇతరులకు బస్సు లభించకపోవటానికి ఇంకొక ముఖ్య కారణము రోడ్డు ట్రాన్స్పోర్టు కార్పొరేషన్ వారు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఈ స్టేజిలో ఆగటం లేదు.

పై కారణాల వలన వెదిర నుండి కరీంనగరం పోయే ప్రయాణీకులకు, కరీంనగరం నుండి ఇటుకు వచ్చేవారికి కష్టము, అసౌకర్యము కలుగుతున్నది.

కావున వెదిర స్టేజి వరకు ఒక లోకల్ బస్సు ఏర్పాటు చేయించాలనీ, డి. వెదిరలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగి వెనకటి వలె ప్రయాణీకులను ఎక్కించుకొనే ఏర్పాట్లు ఉండాలని కోరుతున్నాను.

కె. జగదీశ్చంద్రరావు.

* * *

పతంగుల ఎగురవేత

ఆర్యా! జంట నగరాలలో అధిక సమ్మర్దంకల పెద్ద బజారులలో గాలిపటాలు ఎగురవేస్తుంటారు. ఇదిచాలా హానికరము. ఇంతకు పూర్వం దీనివల్ల ప్రాణాపాయాలు సంభవించినాయి కూడ. అనేక సందర్భాలలో తగాదాలకుకూడా కారణమైనాయి. గాలిపటాలు విశాలమైన మైదానములలో ఎగుర వేసుకోటం ఉచితము గాన ప్రభుత్వము వారు శ్రద్ధవహించి రోడ్లలో గాలిపటాలు వదలకుండా నిషేధించడం ప్రజాక్షేమం దృష్ట్యా అవసరం.

ఆసఫ్‌నగర్ మొగిల

ఆత్మకూరు సమితికి మహిళ అధ్యక్షురాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 14

ఆత్మకూరు పంచాయతీ సమితికి శ్రీమతి కృష్ణవేణమ్మను ఏకగ్రీవంగా అధ్యక్షురాలుగా ఎన్నుకొన్నారు. జిల్లా సమితి అధ్యక్షురాలుగా ఎన్నికయిన ప్రథమ మహిళ ఈమెయే.

భారత ప్రభుత్వం

ఆహార వ్యవసాయ మంత్రాలయం

కంట్రాక్ట్స్ 56/59/ఎ – బొంబాయిలో సెంట్రల్ స్టోరేజ్ గోడౌన్ల వద్ద ఆహార ధాన్యాలు, పిండి, చక్కెర, ఎరువులు ఇతర పదార్థాలు, గోనె బ్యాగ్స్ బేళ్లను వ్యాండిల్ చేయడానికి కూలీ రవాణా కంట్రాక్టర్లను ప్రభుత్వం నిర్ణయించబడింది. ఈ కాంట్రాక్టు సం॥ రాలు కాలానికి నియమించబడుటకు సీలువేసిన టెండరు భారత కార్యదర్శిని తరఫున సెక్రటరీ ఇండస్ట్రీస్ మ. రీజినల్ డైరెక్టర్ (ఫుడ్), సదరన్ రీజియన్, మంగళ బిల్డింగ్, 20-లజ్ ఎవెన్యూ, మద్రాసు-4 వీరికి టెండర్లు, వారి కార్యాలయంలో రు. 4/- (నాలుగు రూపాయలు) (డాపు ఇవ్వబడు) చెల్లించిన మీదట లభించే టెండరు ఫారములపై 4-12-1959 న మధ్యాహ్నం 4 గంటలలోపుగ చేరాలి. సదరు దరఖాస్తును టెండరుతో పంపాలి. లేని పక్షంలో ఆ టెండరు విచారించబడదు. DA-540 (60)

అన్ని విధములైన ఇంపోర్టు లైసెన్సులు

సుందర్ అండ్ కో

సుల్తాన్ బజార్, హైదరాబాద్

జిల్లాల ఆర్డర్లు వి. పి. పి. ద్వారా.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు

సికింద్రాబాద్

హైదరాబాద్, నవంబర్ 15

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా మాజీ మేయర్ శ్రీ అన్నం విశ్వనాథరావు ఎన్నికైనారు.

కార్యవర్గానికి ఈ దిగువ వారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు:

ఉపాధ్యక్షులు: వి. డి. లక్ష్మయ్య, యల్. లింగిచెట్టి, వి. దేవరాజన్, కార్యదర్శులు: ఎ. సర్దార్ సింగ్, ఎం. సూర్యనారాయణ, కోశాధిపతి: ఎం. నరసింహారావు.

సభ్యులుగా డి. రామలాల్, వి.వి. గురుమూర్తి, కె ఎస్. నారాయణ, ఎస్.ఆర్. వెంకటేశం, కె వి. ముత్యాలరావు, జి మల్లయ్య, ఎం. రామచంద్రయ్య, ఎం. వెంకటేశం, ఎం జి. రామచందర్, వై. వెంకయ్య, ముకుందాస్ మాలానీ, గండే రామయ్య, జి. అచ్చయ్య, పి. రాజయ్య.

వరంగల్

వరంగల్లు జిల్లా కాంగ్రెస్ కమిటీకి శ్రీమతి కనక రత్నమ్మను ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు

నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా శ్రీ కె. వి. గంగాధర్ మొన్న పోటీ లేకుండా ఎన్నికయ్యారు.

నూలు వస్త్రాల తయారీకి ప్రమాణాలు

న్యూఢిల్లీ, నవంబర్ 15

నూలు వస్త్రాలూ, కుట్టు దారాల తయారికి భారత ప్రమాణీకరణ సంస్థ మూడు ముసాయిదా ప్రమాణాలను రూపొందించి అభిప్రాయ సేకరణ నిమిత్తం ప్రచురించింది. వాటిపై అభిప్రాయాలు తెలుప దల్చిన వారు 1959 డిసెంబర్ 17 లోగా ఈ క్రింది చిరునామాకు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చు. "ఇండియన్ స్టాండర్డ్సు ఇన్స్టిట్యూటు, న్యూఢిల్లీ."

6 వ సంయుక్త వారం!

ఈగల్ ఫిల్మ్స్ వారి

ఉజాలా

మాలాసిన్హా, షమ్మీకపూర్, రాజ్‌కుమార్, లీలా చిట్నీస్, రమేష్‌సిన్హా, కుమ్‌కుమ్, ధూమల్.

రాయల్ హైదరాబాద్ | అలంకార్ సికింద్రాబాద్ | కృష్ణా హైదరాబాద్

(Trupix) — మహేశ్వరి పిక్చర్స్ రిలీజ్ —

7 వ దిగ్విజయ సంయుక్త వారం!

సుధాకర్ ఫిల్మ్స్ వారి

వచ్చిన కోడలు నచ్చింది

ఎన్. టి. రామారావు, జమున, రేలంగి, కన్నాంబ, సి. యస్. ఆర్, రాజనాల, సూర్యకాంతం, టిటా

సాగర్ హైదరాబాద్

ఆటల సమయములు: 6-00, 9-30.

మార్కండేయ వరంగల్ | నాగేశ్వర్ కొత్తగూడెం | పూర్ణా విశాఖపట్నం | కృష్ణా సూర్యాపేట

(Trupix) — చమ్రియా రిలీజ్ —

జిల్లా ఆసుపత్రులలో అదనపు సౌకర్యాలు

వచ్చే సంవత్సరంలోగా తెలంగాణాలో కూడా ఏర్పాటు

హైదరాబాద్, నవంబర్ 14

తెలంగాణాలోని జిల్లా ఆసుపత్రుల స్థాయిని పెంచడానికి ప్రతి జిల్లా ఆసుపత్రిలోను కనీసం 100 పడకలైనా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

రెండవ ప్రణాళికా కాలం పూర్తయ్యేలోగానే, అంటే 1960-61 ఆర్థిక సంవత్సరంలోనే ఈ స్కీము అమలు జరుగుతుందని ప్రభుత్వ ప్రతినిధి నేడన్నారు.

ఆంధ్ర జిల్లాలలో తాలూకా ఆసుపత్రులన్నింటిని రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవటం ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తవుతుందట.

మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో, తిరుపతిలో వైద్య కళాశాల ఏర్పరచే ప్రతిపాదనలు చేయబడ్డాయి. ఈ వైద్య కళాశాల ఏర్పాటుకు, తిరుమల తిరుపతి దేవస్థానం వారు పెద్ద మొత్తమును విరాళంగా యివ్వడానికి సిద్ధంగా వున్నారు. తిరుపతి ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమం అమలు జరుగుతున్నది. ఒక బొంబాయి సేటు ఇచ్చిన అయిదు లక్షల విరాళంతో యీ పని జరుగుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్యాభివృద్ధి పథకం

వరంగల్, నవంబర్ 14

మూడవ ప్రణాళికా కాలంలో వరంగల్ వైద్య కళాశాల అభివృద్ధికి 20 లక్షల రూపాయలు కేటాయించే ప్రతిపాదనలు జరిగాయి. నూతనంగా ఇక్కడ ఏర్పాటు చేసిన వైద్య కళాశాల అవసరాలదృష్ట్యా వరంగల్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి అవసరమైంది. ఈ ఆసుపత్రిలో పడకల సంఖ్య 200 నుండి 400 కు పెంచుతారు.

ఇదేవిధంగా కాకినాడ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి అయిదు లక్షలు ప్రతిపాదించారు. మూడవ ప్రణాళికా కాలంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలలు, గుంటూరు, కర్నూల్ వైద్య కళాశాలలో ఒక్కొక్కదానిలో 25 సీట్లు చొప్పున సీట్ల సంఖ్య పెంచడానికి నిర్ణయమైంది. ప్రస్తుతం ఉస్మానియా కాలేజిలో 100, గాంధీ మెడికల్ కాలేజిలో 50, గుంటూరు కాలేజిలో 100, కర్నూల్ కాలేజిలో 50సీట్లు మాత్రమే ఉన్నాయి.

స్త్రీ హత్య

నిజామాబాద్, నవంబర్ 14

పొటంగల్ గ్రామంలో గత 10వ తేదీ రాత్రి ఎవరో దుండగులు చంద్రమ్మ అనే 50 ఏండ్ల వితంతువు యింట జొరబడి ఆమెను గొడ్డలితో నరికి చంపారు. చంద్రమ్మ ఏకైక పుత్రుడు ఆ సమయంలో పొలం పని మీద వెళ్ళాడు.

భారతదేశంలో కుటుంబ నియంత్రణ పరిశోధనలకు ఫోర్డు ధార్మిక సంస్థ గ్రాంటు

న్యూఢిల్లీ, నవంబర్ 15

కుటుంబ నియంత్రణ గురించి ప్రజలకు బోధించడానికి సమర్థమైన విధానాలను పరిశోధనల ద్వారా రూపొందించేందుకు ఒక కొత్త కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వారు ప్రవేశపెట్టారు. ఫోర్డు ధార్మిక సంస్థ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి 880,000 డాలర్ల గ్రాంటును మంజూరు చేశారు.

ఇండియాలో ఫోర్డు ధార్మిక సంస్థ ప్రతినిధి డాక్టర్ బ్లాన్స్ ఎక్స్‌మింజర్, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి, శ్రీ వి. కె. ఆర్. వి. రావును కలుసుకొని యీ గ్రాంటుకు సంబంధించిన ఒడంబడిక పత్రాన్ని సమర్పించారు. శ్రీ రావు ఇండియా ప్రభుత్వం తరఫున యీ పత్రంపై సంతకం చేస్తూ, కుటుంబ నియంత్రణ కార్యక్రమ నిర్వహణలో తోడ్పడుతున్నందుకు ఫోర్డు ధార్మిక సంస్థ వారికి కృతజ్ఞత తెలిపారు. ఈ గ్రాంటు యీ కార్యక్రమానికి సంబంధించిన పరిశోధనలు నిర్వహించడంలో ఎంతో తోడ్పడగలదనీ, ఈ విషయంలో డాక్టరు ఎక్స్‌మింజర్ చేస్తున్న కృషి ప్రశంసనీయంగా ఉన్నదని అన్నారు. ప్రజలకు కుటుంబ నియంత్రణనుగురించి బోధించడానికి అవలంబించవలసిన విధానాలపై పరిశోధనలు జరిపితే కుటుంబ నియంత్రణ కార్యక్రమం జయప్రదం కాగలదని ఆశించవచ్చుననీ, తన అభిప్రాయాలలో అన్నారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమం అభివృద్ధి ప్రణాళికలకు పునాది వంటిదనీ డాక్టర్ ఎక్స్‌మింజర్ చెప్పారు. సంతకాలు అయిన తర్వాత, శ్రీ పిళ్లై, డాక్టరు ఎక్స్‌మింజర్ పరిశోధనా కార్యక్రమాన్ని అమలు జరపడానికి తీసుకోవలసిన ప్రారంభ చర్యలను గురించి చర్చించారు.

ఆరోగ్యశాఖ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంటు కర్నల్ జస్వంతసింగ్, ఫోర్డు ధార్మిక సంస్థ ఆరోగ్య సలహాదారు డాక్టరు ఫ్రేమస్, ఆరోగ్యశాఖ డైరెక్టరేటు జనరల్ తాలుకు కుటుంబ నియంత్రణ కార్యక్రమం డైరెక్టర్ లెఫ్టినెంటు కర్నల్ బి.ఎల్. రాయినా ప్రభృతులు యీ ఉత్సవానికి హాజరైనారు.

ఈ కొత్త కార్యక్రమం బహుముఖంగా సాగుతుంది. ఈ కార్యక్రమం క్రింద విశ్వవిద్యాలయాలలో కుటుంబ నియంత్రణను గురించి పరిశోధనలు జరుగుతాయి. పరిశోధనా విధానాలలో కార్యకర్తలకు, శాస్త్రజ్ఞులకు స్వదేశంలోను, విదేశాలలోను శిక్షణ యివ్వబడుతుంది. కుటుంబ నియంత్రణ సమాచార పరిశోధనా నిపుణులతో సంప్రదింపులు జరుగుతాయి. కుటుంబ నియంత్రణ విద్యావిధానాలను రూపొందించి, ప్రయోగించి చూపడానికి దేశంలోని వివిధ ప్రాంతాలలో పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయబడతాయి. ఒక నమూనా కేంద్రం తక్షణమే ప్రారంభించబడుతుంది మరో నాలుగు కేంద్రాలు ఒక ఏడాదిలోగా ప్రారంభించబడతాయి. పరిశోధనా కార్యక్రమం కనీసం 5 ఏళ్ళపాటు సాగుతుంది.

కుటుంబ నియంత్రణ విధానాలను గురించి ప్రజలకు అవసరమైన సమాచారం అంతా అందజేయడం అవసరమని అనుభవరీత్యా తెలిసివచ్చింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గర్భనిరోధక సాధనాలు, పరికరాలు, విధానాలు ఆదర్శప్రాయమైనవి కాకపోయినా, వాటిని గ్రామీణులు ఉపయోగించుకోవడం లాభకరం. మేలురకం కుటుంబ నియంత్రణ విధానాలను రూపొందించడానికి ప్రత్యేక పరిశోధనలు మాత్రం ఇంకా సాగవలసి ఉంది.

పరిశీలనలు

కొత్త పరిశోధనా కార్యక్రమం క్రింద కుటుంబ నియంత్రణ పట్ల ప్రజలకు గల నమ్మకాలను, వైఖరులను పరిశీలించడం జరుగుతుంది. గ్రామీణ ప్రజలకు కుటుంబ నియంత్రణవల్ల కలిగే లాభాలను మనస్సుకు నచ్చేటట్లు ఎలా ప్రచారం చేయాలనే విషయమై కూడా పరిశీలన జరుగుతుంది.

ఈ ప్రచారంలో ఆరోగ్య, సమాజ వికాస సిబ్బంది ఎలా తోడ్పడగలరో కూడా పరిశీలిస్తారు. ఫిల్ములను, పోస్టర్లను యిందుకు ఎలా సద్వినియోగపరుచుకోవాలో ఆలోచిస్తారు. కుటుంబ నియంత్రణకు, విద్యకు సంబంధించిన వివిధ పరిశోధనా పథకాలను కొనసాగించడానికి భారత దేశంలోని ఆయా సంస్థలకు చెందిన ప్రివెంటివ్ వైద్యం, ప్రవర్తనా శాస్త్ర శాఖలకు యీ గ్రాంటునుంచి ధనసహాయం అందజేయబడుతుంది.

దేశంలో నెలకొల్పే, పరిశోధనా కేంద్రాలలో వైద్య, నర్సింగు, ఆరోగ్య విద్య, సాంఘిక శాస్త్ర వృత్తులకు చెందినవారుంటారు. నిపుణులు విడివిడిగా పనిచేసినదానికంటే, ఇలా ఒకే సమస్యపై అందరూ కలిసి ఉమ్మడిగా పనిచేస్తే. ఎక్కువ సత్ఫలితాలు చేకూరగలవని ఆశింపబడుతున్నది. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వారు సమన్వయపరచి నిర్వహిస్తారు.

రేడియో లైసెన్సుల గడువు పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 13

రేడియోలకు 1959వ సంవత్సరానికి ఇవ్వబడిన లైసెన్సుల కాలపరిమితి 1959 డిసెంబరు 31వ తేదీతో ముగిసిపోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వబడలేదు. వచ్చే సంవత్సరానికి లైసెన్సులను రిన్యూచేయించుకోవడానికి 1959 నవంబర్ 1వ తేదీ మొదలు ఏదైనా పనిరోజున వీలుంటుంది. ముగింపు తేదీలోపుగానే తమ లైసెన్సులను రిన్యూ చేయించుకోవడం మంచిది. అయితే ఇందుకు సర్‌చార్జీ లేకుండా ఒక నెల (1960 జనవరి నెలలో పోస్టాఫీసుల చివరి పనిరోజు వరకు) వరకు గడువు ఇవ్వబడుతుంది. ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ గడువు పొడిగించబడదు.

ఏదైనా హెడ్ లేదా సబ్ పోస్టాఫీసులో గడువు దాటిన లైసెన్సును ఇచ్చి కొత్త లైసెన్సు పొందవచ్చును. ఇందుకు లైసెన్సులో జోడించివుండే రిన్యూవల్ ఫారమును పూరించి ఇవ్వడంతోపాటు నిర్ణీతఫీజునుకూడా చెల్లించవలసి వుంటుంది. ఒక వేళ పాత లైసెన్సు దొరకకుండా పోయినట్లయితే రిన్యూవల్ ఫీజు మొత్తాన్ని ఏదైనా హెడ్ లేదా సబ్ పోస్టాఫీసులో రాయతీ గడువులోపుగా తాత్కాలికంగా డిపాజిట్టు చేసి పోస్ట్ సర్కిల్ అధిపతికి పోయిన లైసెన్సుకు సంబంధించిన వివరాలను తెలిసినంతవరకూ ఇస్తూ ప్రత్యామ్నాయ లైసెన్సు కొరకు దరఖాస్తుఇవ్వవలెను. ఈ ప్రకారం పొందిన ప్రత్యామ్నాయ లైసెన్సులను దాఖలు చేస్తే కొత్త లైసెన్సులు ఇస్తారు.

రాయతీ గడువు తరువాత అయితే కొత్త లైసెన్సులు పొందడానికి మామూలు లైసెన్సు ఫీజుతోపాటు అదనంగా సర్‌చార్జి కూడా చెల్లించవలసి వుంటుంది

ఒక రేడియో సెట్టు ఎవరి అధీనంలోనైనా వున్నట్లయితే అది పని చేస్తున్నా, పని చేయకపోయినా దానికి లైసెన్సు పొందడం అవసరం. ఒకవేళ అది బాగు చేయడానికి వీలులేకుండా చెడిపోయినట్లయితే లైసెన్సుదారు ఆవిషయాన్ని లైసెన్సు ఇచ్చిన పోస్టు మాస్టరుకు లైసెన్సు గడువు లోపుగా ఆ విషయంలో తగు చర్య తీసుకునే నిమిత్తం తెలియజేయవలెను.

1885 వ సంవత్సరపు ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, 1933 వ సంవత్సరపు ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రఫీ చట్టం క్రింద ఎవరైనా లైసెన్సు లేకుండా సెట్టును తమ అధీనంలో వుంచుకోవడం నేరం క్రింద వస్తారు. అటువంటివారికి ఎక్కువగా జరిమానాలు విధించడానికి యీ చట్టాలు నిర్దేశిస్తున్నవి.

ఒక యింట్లోనే ఒకటికంటె యెక్కువ రేడియోలు వుంటే అలా అదనంగా వున్న వాటిలో ఒక్కొక్క రేడియోకి సంవత్సరానికి 3 రూపాయలు లైసెన్సు రుసుం చెల్లిస్తే చాలు. ప్రస్తుతం అన్ని రేడియో లైసెన్సు రుసుము 15 రూపాయలుగానే వుంటున్నది. ఇక ముందు నుంచి మొదటి రేడియోకి మాత్రమే 15 రూపాయలు లైసెన్సు చెల్లించాలి.

కమ్యూనిటీ, గ్రామీణ గృహ లైసెన్సుల క్రింద గల అదనపు సెట్లకి కూడా తగ్గింపు రేటు 3 రూపాయలు వర్తిస్తుంది. క్రిస్టల్, పాఠశాల, పబ్లిక్ లైబ్రరీ లైసెన్సుల విషయంలో మాత్రం తగ్గింపు యేమీ వుండదు. వాటి విషయంలో మొదటి రేడియోకి వలెనే అదనపు సెట్లకి కూడా 3 రూపాయలు వసూలు చేయబడతాయి.

వాణిజ్య ప్రయోజనాలకు వాడే అదనపు సెట్లవిషయంలో ప్రతిఅదనపు సెట్లుకి సంవత్సరానికి 5 రూపాయలు వసూలు చేయబడతాయి. మొదటి సెట్టుకు మాత్రమే సంవత్సరానికి 50 రూపాయలు వసూలు చేయబడతాయి.

ఆస్పత్రి లేక ఆరోగ్య సదనంలో 15 రూపాయల లైసెన్సు అన్ని లైసెన్సులకు వర్తిస్తుంది. అయితే, లైసెన్సు యిచ్చే పోస్టాఫీసు, అన్ని సెట్లను యేక లైసెన్సులోనే చేర్పించాలి. ఈసౌకర్యం ప్రైవేటు నర్సింగ్ హోంలకు, డబ్బు తీసుకుని చికిత్స చేసే ఆస్పత్రులు లేక ఆరోగ్య సదనాలకు వర్తించదు. ఆస్పత్రుల యేక లైసెన్సు ఆస్పత్రి ఆవరణలో గల డాక్టర్లు లేక యితర సిబ్బంది యిళ్ళలో గల రేడియో సెట్లకి వర్తించదు.

వైర్‌లెస్ లైసెన్సును, యిప్పుడు దానిలో పేర్కొనబడిన సెట్టుతో

విశాఖ వార్తలు

విశాఖపట్నం, నవంబర్ 14

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యత్వానికి శ్రీ బి. జి. ఎం. ఎ. నరసింగరావు (శాసన సభ్యుడు) శ్రీ కంచర్ల శ్రీరామమూర్తి గార్ల మధ్య పోటీ జరుగగా శ్రీ నరసింగరావు ఇరవై ఓట్ల మెజారిటీతో ఎన్నికైనారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యత్వమునకు జరిగిన పోటీలో శ్రీ గుడివాడ వెంకటరమణ 31 ఓట్ల మెజారిటీతో శ్రీ యల్.యస్. రావును ఓడించారు.

* * *

ఆంధ్ర విశ్వ విద్యాలయం హిస్టరీ ఎకనమిక్స్, పోలిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన "భారత దేశ వైదేశిక రాజ్యాంగ నీతి-చైనా దురాక్రమణ" గురించి బహిరంగ సభ ఏర్పాటు చేయబడింది. అందు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సభకు ప్రొఫెసర్ బి. సర్వేశ్వరరావు గారు అధ్యక్షత వహించారు.

ప్రొఫెసర్ మీనాక్షి సుందరం మాట్లాడుతూ చైనా వారు క్రమించరాని అక్రమానికి పాల్పడ్డారనీ, వారిని తరిమికొట్టి భారత భూభాగాన్ని రక్షించుకోవాల్సివుందని అన్నారు. నెహ్రూ తన సామర్థ్యాన్ని నిరూపించుకోవలసిన సమయమిప్పుడొచ్చిందన్నారు. భారత దేశం అనుసరిస్తున్న ద్వంద్వ విధానం శ్రేయస్కరం కాదన్నారు.

డాక్టర్ ఆర్.వి. చంద్రశేఖరరావు ప్రసంగిస్తూ భారత దేశం చూపిస్తున్న తటస్థ విధానం మంచి ఫలితాల్ని యివ్వలేక పోవచ్చుననీ, అట్టి విధానం ఎక్కువ అనర్థాలకు దారి తీయవచ్చుననీ, ఈ విషయాన్ని నెహ్రూ త్వరలోనే గ్రహించాలని ఆశించారు.

డాక్టర్ ఇ.యమ్. శాస్త్రి, యన్. ఆర్. శివస్వామి, పి. వి. నరసింహం గారలు కూడా ప్రసంగించారు.

అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి యం. జి. సత్యాని వందన సమర్పణతో సభ ముగిసింది.

సహకార సప్తాహం

హైదరాబాద్, నవంబర్ 12

బహుళార్థ సహకార సంఘాలలో ఉద్యోగాలు విరమించి విశ్రమిస్తున్నవారు స్వచ్ఛంద సేవ చేయడానికి ముందుకు రావడం చాలా అవసరమని సహకార సప్తాహం సందర్భంలో మలక్‌పేటలో మంత్రి మెహదీ నవాజ్ జంగ్ కోరారు. మీర్ అహమ్మదాలీ ఖాన్ ఈసమావేశానికి అధ్యక్షత వహించారు. మాధవరావు అన్వారీ, కొండా లక్ష్మణ్ గారలు కూడా సభలో ప్రసంగించారు.

తంతి, తపాలాశాఖ మాండలిక సాంస్కృతిక కార్యక్రమాలు

హైదరాబాద్, నవంబర్ 13

తంతి, తపాలా శాఖ మాండలిక సాంస్కృతిక కార్యక్రమాలు 1959 నవంబర్ 14, 15 వ తేదీలలో బర్కత్‌పురాలోని ఆంధ్ర యువతీ మండలి హాలులో సాయంత్రం 6 గంటలకు జరుగుతాయి. చివరిరోజు కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ చంద్రారెడ్డి అధ్యక్షత వహిస్తారు. శ్రీమతి చంద్రారెడ్డి బహుమతులు పంచిపెడతారు.

వరంగల్లు ఉపాధ్యాయ పరిషత్తు

వరంగల్లు, నవంబర్ 15

వరంగల్లు ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ పరిషత్తు అడ్‌హాక్ కమిటీ యీ క్రిందివారితో ఏర్పడింది: అధ్యక్షులు శ్రీ యం. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు శ్రీ జి రాధాకిషన్, శ్రీ యస్. యస్. శాస్త్రి గారలు, కార్యదర్శి శ్రీ యం. ఎస్. సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శులు శ్రీ వి. వి. సుందర్ రావు, శ్రీ ఎ. నర్సింగరావు, కోశాధికారి శ్రీ యన్. రంగయ్య.

రాజమండ్రి నగరానికి మంచినీరు, డ్రెయినేజి పథకాలు

136 లక్షల పథకం

రాజమండ్రి, నవంబర్ 14

రాజమండ్రి పట్టణానికి మంచినీటి సప్లయి పథకం వెంటనే ప్రారంభించాలనీ, దాంతో పాటుగనే డ్రెయినేజి సౌకర్యం కూడ కల్గించాలనీ గవర్నర్ భీమసేన్ సచార్‌కు ధవళేశ్వరం మకాంలో పురపాలక సంఘం తరఫున 2 వ తేదీన ఒక మెమోరాండం సమర్పించారు. మంచినీటి సప్లయి పథకానికి 39 లక్షలు, డ్రెయినేజ్ స్కీముకు 97 లక్షలు ఖర్చవుతుందనీ అంచనా. మంచినీటి సప్లయి పథకం రెండు అంచెలుగా అమలు జరుగుతుందనీ, మొదటి దశలో 175 వేల మందికి మంచినీటి సప్లయి జరుగుతుందనీ, రెండవ దశ పని కూడా పూర్తయితే, మొత్తం 230 వేల మందికి మంచినీరు సప్లయి కాగలదని అధికారుల అంచనా.

తంతి: ADITYA ఫోన్: 7204

BEC

మన్నికకు, నమ్మకానికి ప్రసిద్ధి గాంచినది

2 నుంచి 21 హెచ్. పి. వరకు

ఆంధ్రప్రదేశ్‌కు డిస్ట్రిబ్యూటర్లు:

శ్రీ కుసుమ హరనాథ్ ఇంజనీరింగ్ కంపెనీ

138, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్.



(Edwin)

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

ప్రకటన నెం. (31)

ఆంధ్ర ప్రాంతంలో ఆదిమ జాతికి, తెలంగాణా ప్రాంతంలో షెడ్యూలు ట్రైబ్స్‌కు చెందిన అభ్యర్థులను, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో ఉన్న ఏజన్సీ ట్రాక్ట్స్ కార్యాలయాలలో మినిస్టీరియల్ సర్వీస్‌లో నున్న పదవులలో నియామకం.

పైన తెలిపిన విధంగా ఆంధ్ర జిల్లాలలోని ఏజన్సీ ప్రాంతాలకు చెందిన ఆదిమ వాసుల అభ్యర్థులనుంచి, తెలంగాణా జిల్లాలలోని ఏజన్సీ ప్రాంతాలకు చెందిన షెడ్యూల్డ్ ట్రైబ్స్ అభ్యర్థులనుంచి ఇందు మూలముగా దరఖాస్తులు కోరబడుతున్నవి. విద్యా యోగ్యతల విషయంలో ప్రత్యేక కన్సెషన్లు ఇవ్వబడును. వ్రాత పరీక్షగాని, ఓరల్ పరీక్షగాని లేకుండానే రిక్రూట్‌మెంటు చేయబడును.

2. స్త్రీలు (ఆదిమ జాతివారు, షెడ్యూల్డ్ ట్రైబ్స్) కూడా దరఖాస్తులను పంపుకొన వచ్చును.

3 పైన తెలిపిన జిల్లాల ఆదిమ వాసులు లేక షెడ్యూల్డ్ ట్రైబ్స్ వారిలో తాత్కాలిక ప్రభుత్వోద్యోగులు, యుద్ధ సర్వీసు అభ్యర్థులు (ఎ. ఎస్. పి. పర్సనల్ కలుపుకొని), బర్మా మాజీ ప్రభుత్వోద్యోగులు, రక్షణ శాఖ నుంచి డిస్ ఛార్జిచేయబడిన సివిలియన్ ఉద్యోగులు ఎవరైనా ఉన్నట్లయితే వారికి వయస్సు విషయంలో ప్రత్యేక కన్సెషను చూపబడును. పైన తెలిపిన ఆదిమ జాతివారు లేక షెడ్యూల్డ్ ట్రైబ్స్‌లో సైన్యం, నౌకాదళం, విమాన దళం నుంచి తొలగించబడిన వారున్నట్లయితే వారి వయస్సు, విద్యాయోగ్యతల విషయంలో కొన్ని కన్సెషన్స్ ఇవ్వబడును.

కమిషన్ కార్యాలయంలో దరఖాస్తులను తీసుకోడానికి ఆఖరు తేదీ 15-12-1959 పదవిని ఉదహరిస్తూ, తగినన్ని స్టాంపుల నంటించిన స్వంత అడ్రసు గల కవరును పంపుతూ వ్రాత పూర్వకంగా కోరిన మీదట వివరాలను, దరఖాస్తు ఫారములను హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాదర్శి నుంచి పొందవచ్చును. స్టాంపులతో స్వంత అడ్రసుగల చిరునామా లేకుండా కోరేవారికి అవి ఎంతమాత్రం పంపబడవు. గమనిక: స్వంత చిరునామాను వ్రాసి పంపే కవరు పొడుగు కనీసం 9 అంగుళాలు ఉండాలి. దానిమీద 15 నయాపైసల స్టాంపును అంటించాలి.

ఈ నాడు

అత్యధికంగా అమ్మకమగుచున్నది

లోదు పూర్తిగా శిరోజములను నలుపు చేయునట్టిది మాత్రమే గాక, దిన్యమైన హేర్ డ్రెస్సర్ కూడా! అందుచేతనే యువకులు, వృద్ధులు, పెద్దపులు, స్త్రీలు, అందరూ, చాలా ఎక్కువమంది జనులు, భారత దేశమంతటాను, విదేశాలందును, శిరోజములను నలుపుచేసే మరేదీ గానుండా లోమనే వాడుచున్నారు.

ఏజంట్లు: పటేల్ & కో, కింగ్స్‌వే, సికింద్రాబాద్.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం-చిట్ టెండరు నోటీసు

ఈ క్రింద పేర్కొనబడిన పనులకుగాను ప. వ. శాఖ యొక్క నమోదైన కంట్రాక్టర్ల నుంచీ, ప్రసిద్ధ సంస్థల నుంచి సీలువేసిన టెండర్లు వేరు వేరుగా కావలెను.

క్రమ సంఖ్య.	పని పేరు	కంట్రాక్టు మొత్తం -సుమారుగా	కంట్రాక్టు స్వభావం.	బయానా ధనం	పని పూర్తి చేయవలసిన గడువు	టెండరు పత్రాల ఖరీదు
	మలక్‌పేటవద్ద ఉద్యోగ సిబ్బంది ఇండ్లను నిర్మించుట.					
1.	గ్రూపు నెం. 5–డి నమూనా ఇండ్లు 47 2 వ దశ	1,78,600	పీస్ వర్క్ (కె 2)	4470/-	ఆరు నెలలు	13.26 న. పై.
2.	గ్రూపు నెం. 6–బి నమూనా ఇండ్లు 14 మూడవ దశ	1,24,600	"	3120/-	ఆరు నెలలు	12.24 న. పై
3.	గ్రూపు నెం. 7–సి నమూనా ఇండ్లు 21 3 వ దశ	1,50,000	"	3750/-	ఆరు నెలలు	12.75 న. పై
4.	గ్రూపు నెం. 7–సి నమూనా ఇండ్లు 21 3 వ దశ	1,50,000	"	3750/-	ఆరు నెలలు	12.75. న. పై.
5.	గ్రూపు నెం. 9–డి నమూనా ఇండ్లు 13 3 వ దశ	49,400/-	"	1240/-	నాలుగు నెలలు	5.10 న. పై.

1. టెండర్లు 8-12-1959 తేదీ సా. 3-30 గంటలవరకు స్వీకరించబడతాయి.
2. టెండర్లను 8-12-1959 తేదీ సా. 4 గంటలకు దిగువ సంతకం చేసినవారు తెరుస్తారు.
3 రేట్ల పట్టిక, స్పెసిఫికేషనులు మొదలగు వాటితోసహా టెండరు ఫారములను 26-11-1959 తేదీ నుంచి 3-12-59 తేదీ వరకు పనిరోజులలో, ఆఫీసు వేళలలో పైన పేర్కొన్న ఖరీదును చలానా రూపంలో చెల్లించి పొందవచ్చును.
4 ప్రతి పని కూడా ఆయా గ్రూపులకు ఎదురుగా పేర్కొనబడిన గడువు లోపుగా పూర్తి చేయబడవలెను.
5 తమ ఆదాయం పన్ను, అమ్మకం పన్ను క్లియరెన్సు సర్టిఫికెట్లను పొందినట్టి కంట్రాక్టర్లు మాత్రమే యీ పనులకు టెండర్లు ఇచ్చుటకు అర్హులు.
6. పని, మద్రాసు డిటేల్డ్ స్టాండర్డ్

13వ సంయుక్త వారం

వి. శాంతా రామ్ వారి

Its Rajkamal

నవ్ రంగ్

—: టెక్నికలర్ చిత్రం :—

సంధ్య, మహీపాల్, వందన, అగా

ప్రభాత్

హైదరాబాద్

ఆటల సమయాలు: 6-15, 9-30

— అలంకార్ చిత్ర రిలీజ్ —

7వ సంయుక్త వారం!



రాజాత్ రిగల్

హైదరాబాద్ ఖైరతాబాద్

మోహన్ నిజామాబాద్

నేడు 2 ఆటలు: 6-00, 9-30

తర్వాత చిత్రం

చిత్ర సికింద్రాబాద్

— ఉదయశ్రీ రిలీజ్ —

మీ అభిమాన తారలను కల్సుకోండి

ఏ చిత్రంలోను మీరు చూచి ఉండలేదు

ది లీప్ కుమార్

వైజయంతీ మాల

జెమినీవారి

మహోజ్వల చిత్రం

పైగామ్

ఇప్పుడు ప్రదర్శించ బడుతోంది!

జమరుద్ హైదరాబాద్

అజంతా సికింద్రాబాద్

ప్రతి రోజు 2 ఆటలు: 6-15, 9-30

(Bahar)

రాజధాని నగరంలో ఎకాడమీవారి నాటక శాలలు

12 లక్షల ఖర్చుతో ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 14

కూచిపూడి నాట్య కళాభివృద్ధికి సంబంధించిన ఒక పథకాన్ని రాష్ట్ర సంగీత నాటక ఎకాడమీ వారు తయారు చేసారు. ఈ స్కీము కేంద్ర ఎకాడమీ పరిశీలనలో ఉన్నట్లు ప్రభుత్వ ప్రతినిధి తెల్పారు.

వయస్సుమళ్ళిన కూచిపూడి నాట్యం వంత పాటగాండ్ర పాటలను చేపుకి కార్డు చేసి, భద్రం చెయ్యాలని నాటక సాహిత్య ఎకాడమీ నిర్ణయించింది.

రాజధాని నగరంలో 1500 మంది కూర్చోడానికి వీలుగా ఒక మామూలు నాటక శాలను, మూడు వేల మంది కూర్చోడానికి వీలుగా ఒక బహిరంగ ప్రదర్శన శాలను నిర్మించాలని ఎకాడమీ వారు తీర్మానించారు. ఈ రెండు ప్రదర్శన శాలలకు మొత్తం 12 లక్షలు ఖర్చవుతుంది. స్థల నిర్ణయం అరగ్గానే నిర్మాణ కార్యక్రమం ప్రారంభమౌతుంది.

జీపు ప్రమాదంలో పంచాయతీ అధ్యక్షుని దుర్మరణం

మెదక్, నవంబర్ 14

జోగిపేట తాలూకా రామరెడ్డి అనే పంచాయతీ అధ్యక్షులు రామరెడ్డి ఒక జీపు ప్రమాదంలో మరణించాడు. అదే జీపులో ప్రయాణం చేస్తున్న అయిదుగురు కాంగ్రెస్ కార్యకర్తలకు దెబ్బలు తగిలాయి. అళ్ళదుర్గ గ్రామం వద్ద నవంబర్ 11వ తేదీన జీపుపైరు పగిలిపోగా, యీ ప్రమాదం సంభవించింది. బ్లాకు వెలుపలి గ్రామాల తరపున జరిగే పరిషత్తు, సమితి ఎన్నికల ప్రచారం సందర్భంగా యీ జీపు ప్రమాదం సంభవించింది.

నిజామాబాద్ జిల్లా పరిషత్తు

28 వ తేదీన అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

నిజామాబాద్, నవంబర్ 14

నిజామాబాద్ జిల్లా పరిషత్తు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక సమావేశం 28 వ తేదీన జరుగుతుంది. 27 వ తేదీన కోఆప్షన్ సభ్యులనలుగురిఎన్నిక జరుగుతుంది. పంచాయతీ సమితులు ఏర్పాటు కాని ప్రాంతాలను అయిదు మండలులుగా విభజించారు. ఆ మండలాల నుంచి జిల్లా పరిషత్తుకు ప్రతినిధుల ఎన్నిక 19వ తేదీన జరుగుతుంది.

సహకార పరపతి సంఘం

ఆర్మూరు, నవంబర్ 12

ఆర్మూరు గ్రామంలో ప్రణాళికా దినోత్సవం గృహనిర్మాణ సహకార సంఘంవారి అధ్వర్యాన జరిగింది. గ్రామంలో సహకార పరపతి సంఘం అవసరమని భావించి, ఒక సంఘాన్ని రిజిస్టరు చేయించడానికి తీర్మానించారు. తాత్కాలికంగా గ్రామ సహకార పరపతి సంఘానికి డాక్టర్ కిషన్ ప్రసాద్ అధ్యక్షులు, ధోండి నారాయణ కార్యదర్శి, జందంసోమయ్య కోశాధికారిగ కార్యవర్గం ఏర్పడింది. షేరుధనం ప్రవేశ రుసుము క్రింద ఒక్కొక్కరి వద్ద 11 రూపాయల రుసుము వసూలు చేశారు కూడా.

అల్యాబాద్‌లో సహకార దినోత్సవం

మేడ్‌చల్, నవంబర్ 12

అల్యాబాద్ గ్రామంలో శ్రీ రామచంద్రరావుగారి అధ్యక్షతన సహకార వారోత్సవం జరిగింది. రాత్రి సహకార విధానం గురించి సినిమా ప్రదర్శనం జరిగింది.

కేరళ, మైసూర్‌లకు కూచిపూడి నాట్య బృందం

హైద్రాబాద్, నవంబర్ 14

భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్రీయ వైజ్ఞానిక బృందాల సంచార కార్యక్రమం స్కీము లో ఆంధ్రప్రభుత్వం కూడా పాల్గొనడానికి అంగీకరించింది. ఈ స్కీము క్రింద మైసూర్, కేరళ రాష్ట్రాలకు ఒక కూచిపూడి నాట్య బృందాన్ని పంపడానికి ఆంధ్రప్రభుత్వం నిశ్చయించినట్లు ప్రభుత్వ ప్రతినిధి నేడిక్కడ వెల్లడించారు. ఈ నాట్య బృందం ప్రయాణాది ఖర్చులు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది.

గీతా సప్తాహం

దేవరకొండ, నవంబర్ 15

పండిత గోపదేవశాస్త్రిగారు 22వ తేదీ నుంచి 28 వరకు గీతాసప్తాహం జరుపుతారు. ఈ వారం రోజులు గీతాప్రవచనాలు గురించి వారు ఉపన్యాసాలిస్తారు. ఈ సప్తాహానికి మిర్యాల గూడెం వర్తక సంఘాధ్యక్షులు శ్రీ రెడ్ల శ్రీరాములు ప్రారంభోత్సవం చేస్తారు.

నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ

నారాయణపేట, నవంబర్ 14

నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి గత వారం జరిగిన ఎన్నికలలో శ్రీ సంగన బసప్ప ముగ్గురి అధ్యక్షులుగా పోటీ లేకుండా ఎన్నికయ్యారు.

నగరంలో నేడు

సాయంకాలం 6-30 గంటలకు సుల్తాన్ బజార్‌లోని శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో శ్రీ పుచ్చా సుబ్రహ్మణ్యశాస్త్రి "సంగీతం, సాహిత్యం" అనే విషయంపై ప్రసంగిస్తారు.

రాజధాని వార్తలు

ప్రాగాటూల్స్ కార్పొరేషన్ జనరల్ మానేజర్ శ్రీ వి. వెంకటరామన్ గురువారం నాడు విమానంలో బొంబాయి మీదుగా లండన్ బయలుదేరి వెళ్ళారు. ఐరోపా దేశాలలో నాల్గు వారాల పాటు పర్యటించి, ప్రాగా టూల్స్ కర్మాగార విస్తరణకు యంత్రాల కొనుగోలు విషయమై సంప్రదింపులు జరుపుతారు.

* * *

ఇటీవల లడక్‌లో వైనీస్ దళాల చేత హతమార్చబడిన భారత గస్తీ పోలీసులకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు శనివారంనాడు శ్రద్ధాంజలి సమర్పించారు. రాష్ట్ర పోలీస్, అగ్ని మాపక దళ మూడవ సప్తాహం ప్రారంభ సమావేశం జరిగినప్పుడు మృతుల స్మృతి పట్ల గౌరవ సూచకంగా సభికులంతా రెండు నిమిషాల సేపు మౌనంగా నిలబడ్డారు.

* * *

ఆంధ్ర ప్రదేశ్ హిందీ విద్యార్థి సమ్మేళనం డిసెంబర్ 19, 20 తేదీలలో జరుగుతుంది. సమ్మేళనానికి ఏర్పాట్లు చేయటానికిగాను శ్రీ శంకరరావు కప్పికేరి అధ్యక్షతన ఒకఆహ్వాన సంఘం ఏర్పడినది.

అభ్యుదయ కళాసమితి

హైద్రాబాద్: హిమాయత్ నగర్‌లో అభ్యుదయ కళాసమితి కార్యాలయంలో నెహ్రూ జన్మదినోత్సవం జరిగింది.

బోయిన్‌పల్లిలో నెహ్రూ జయంతి సభ జరిగింది. జె. సి. సత్యనారాయణ, రాజశేఖరరావు, సి. నరసింహులు, ప్రభృతులు ఉపన్యసించారు. ఆట పాటలలో గెలుపొందినవారికి కుక్కలమైసయ్యగారు బహుమతులు పంచారు.

మాతృదేశ రక్షణ

యువకులకు గవర్నరు సచార్ హెచ్చరిక

ఏలూరు, నవంబర్ 15

దురాక్రమణ అన్నది ఎటునుంచి వచ్చినా, ఆ దురాక్రమణనుంచి మాతృభూమిని రక్షించాలనీ, ఈ విషయంలో యువకులు దేశమాత పిలుపును అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలనీ గవర్నర్ శ్రీ సచార్ యువకులకు హెచ్చరిక చేశారు.

గత శుక్రవారం శ్రీ సి. ఆర్. రెడ్డి కళాశాలావరణలో సమావేశమైన కళాశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులనుద్దేశించి ఆయన హెచ్చరికను చేశారు.

చైనా దురాక్రమణ చాలా ఆందోళనను కలిగించిందనీ, అందరి ఆలోచనలు ఈ సమస్యపైనే లగ్నమై ఉన్నాయనీ ఆయన అన్నారు.

అంతర్జాతీయ రంగంలో ఒక దేశానికి మరొక దేశం ఇచ్చే వాగ్దానాలు, ఒడంబడికలు మొదలైన వాటిపై ఎంత భరోసాను ఉంచవచ్చు నన్న సందేహం చైనా చర్యల వల్ల ప్రతి వారికీ కలుగుతున్నదనీ, పంచశీలను ఆమోదించిన రాజ్యాలలో చైనా ముఖ్యమైనదనీ, ఆ చైనాయే ఈ పంచశీల సూత్రాలను ఉల్లంఘించడం శోచనీయమనీ ఆయన అన్నారు.

చైనా చర్యల వల్ల మనకు కోపం కలిగిన మాట నిజమేననీ, అయినప్పటికీ పెద్ద రాజ్యాలూ, ఆ రాజ్యాల ప్రజలూ కోపానికి లోబడి తమ లక్ష్యాలను మార్చుకోనరాదనీ ఆయన అన్నారు. ఇటువంటి విషయాలలో ప్రధాని నెహ్రూ వివరించినట్లు పెద్ద మనుషులుగానూ, దృఢచిత్తులుగానూ మనం వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దురాక్రమణ దారునకు ఒక అంగుళం మేరనైనా మన భూభాగాన్ని స్వాధీనం చెయ్యడం జరగదని ప్రధాని నెహ్రూ వివరించారనీ, ఆయన వలెనే దృఢ నిశ్చయంతో మనం ప్రధానికి అండదండలుగా ఉండాలనీ శ్రీ సచార్ అన్నారు. ఈ లక్ష్య సిద్ధికి అవసరమైన త్యాగాన్ని అదెంత గొప్పదైనా చెయ్యడానికి మనం సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

పిలుపువస్తే ప్రతీ యువకుడూ సుశిక్షితుడైన సైనికునివలె వర్తించడానికి సంసిద్ధంగా ఉండాలనీ, ఎంత త్యాగానికైనా వెనుదీయరాదనీ ఆయన అన్నారు.

కటక్ ప్రదర్శనలకు కమ్యూనిస్టులే కారణం

శ్రీ హరేకృష్ణ మెహతాబ్ ఆరోపణ

భువనేశ్వర్, నవంబర్ 14

దేశ వ్యవహారాల మంత్రి శ్రీ జి. బి. పంత్‌కు వ్యతిరేకంగా కటక్‌లో నిన్న జరిగిన ప్రదర్శనల వెనక కమ్యూనిస్టుల హస్తం ఉన్నదని ఒరిస్సా ముఖ్యమంత్రి డాక్టర్ హరేకృష్ణ మెహతాబ్ నేడు ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

మనిలా, నవంబర్ 14

ఫిలిప్పీన్స్‌లో ఎన్నికల కలహాలలో 8 మంది మరణించినట్టు, మరో నల్గురు గాయపడినట్టు పోలీసులు నేడు ప్రకటించారు.

* * *

కలకత్తా, నవంబర్ 13

కేంద్ర ఆర్థిక ఉప మంత్రి శ్రీ బి ఆర్. భగత్‌కు నేడిక్కడ ఎన్. ఎస్. కె. ఎం. ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది.

* * *

ఇండోర్, నవంబర్ 13

పేరుమోసిన గజదొంగ గబ్బార్ సింగ్, ఆయన ముఠా సభ్యులందరూ కూడా హత మార్చబడ్డారు.

* * *

ఖాట్మండూ, నవంబర్ 13

నేపాల్ తొలి జనరల్ ఎన్నికలు చెల్లనేరవని డాక్టర్ కె. ఐ. సింగ్ పెట్టుకున్న రిట్ పిటిషన్‌ను నేపాల్ సుప్రీంకోర్టు నేడు కొట్టివేసినది.

భువనేశ్వర్, నవంబర్ 13

ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను కలిపి ఒక ప్రత్యేక ఆహారమండలం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై ఉభయరాష్ట్రాల ముఖ్యమంత్రులు నేడిక్కడ ఇష్టాగోష్ఠి చర్చలు జరిపారు.

రాజధానిలో బాలల దినోత్సవం

హైద్రాబాద్, నవంబర్ 15

నెహ్రూ జన్మదినోత్సవం సందర్భంగా భారతీయ శిశు సంక్షేమ కౌన్సిల్ వారి అధ్వర్యాన నిన్నటి దినం ఇక్కడ బాలల దినోత్సవం కూడా జరిగింది. ఈ సందర్భంలో ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన ఉత్సవంలో 30 వేల మంది బాలబాలికలు పాల్గొన్నారు.

కంటోన్‌మెంట్ బోర్డు సభ్యుని అరెస్టు

సికింద్రాబాద్, నవంబర్ 15

సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోర్డులో ప్రజా సోషలిస్టు సభ్యుడైన శ్రీ జగన్నాథం, మరి నలుగుర్ని గత నెల అక్టోబర్ 29వ తేదీన బొలారంలో జరిగిన ఒక సంఘటన సందర్భంగా నగర పోలీసులు నేడు అరెస్టు చేశారు.

పోలీసులు మరో వ్యక్తికోసం వెతుకుతున్నారు. కాని అతని జాడ తెలియటం లేదు.

అరెస్టు కాబడిన వ్యక్తులు అక్టోబర్ 29వ తేదీన బొలారంలోని ఒక దుకాణానికి వెళ్ళి గోధుమలు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నాడన్న విషయంపై దుకాణ దారుతో తగాదా పెట్టుకున్నారు. అంతేగాక వారు రాళ్ళు కూడా విసిరినట్టు, దాని మూలంగా రెండు దుకాణాలు నష్టపడ్డట్టు కూడా చెప్పబడుతున్నది.

అరెస్టు చేసిన వ్యక్తులను పోలీసులు తర్వాత బెయిల్ మీద విడుదల చేశారు.

పురపాలక సంఘం ఉప ఎన్నికలు

స్వతంత్ర అభ్యర్థుల గెలుపు

హైద్రాబాద్, నవంబర్ 15

హైద్రాబాద్ పురపాలక సంఘానికి రెండు నియోజక వర్గాల నుంచి జరిగిన ఉప ఎన్నికలలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికైనట్లు ప్రకటించ బడింది.

దుర్గాయాసఫిన్ నియోజకవర్గం

మొత్తం ఓటర్లు 4195 పోలైన ఓట్లు 2115.

శ్రీ సయ్యద్ సిరాజుద్దీన్ (స్వతంత్ర) 1089 ఓట్లతో ఎన్నికయ్యారు. శ్రీ హాఫిజుద్దీన్ (స్వతంత్ర) 378 ఓట్లు, అబ్దుల్ ఖాన్ (స్వతంత్ర) 301 ఓట్లు, శ్రీ జగ్నేశ్ ప్రసాద్ (స్వతంత్ర) 263, శ్రీ కాఖా మొయినుద్దీన్ (సతంత్ర) 84 ఓట్లు.

కుత్బిగూడ నియోజకవర్గ

మొత్తం ఓటర్లు 5997. పోలైన ఓట్లు 2514.

శ్రీ అనంతరెడ్డి (స్వతంత్ర) 1620 ఓట్లతో ఎన్నుకోబడ్డారు. శ్రీ సర్వార్ ఖాన్ (స్వతంత్ర) 891 ఓట్లు. రద్దైన ఓట్లు 3.

బాల సాహిత్యం

బహుమతిపొందిన తెలుగు గ్రంథాలు

న్యూఢిల్లీ, నవంబర్ 14

బాలసాహిత్యాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఏటేటా నిర్వహించే పుస్తక పోటీలో శ్రీ యస్. కృష్ణరావు రచించిన "పడిపాటలు" అనే పుస్తకానికీ, శ్రీ యస్. లక్ష్మణరావు వ్రాసిన "చిలకమ్మ కథలు" అనే పుస్తకానికీ కేంద్ర ప్రభుత్వ బహుమతులు లభించాయి. బహుమతి పొందిన రచయితలకు 500 రూపాయల నగదు బహుమతి నివ్వడమే కాక, మరో 200 పుస్తకాలను గ్రంథాలయాల ఉపయోగార్థం ప్రభుత్వం భరీదుచేస్తుంది. మిగిలిన భాషలలో ఈ పోటీకి పంపబడ్డ పుస్తకాలలో బహుమతి పొందిన పుస్తకాల జాబితాను కూడా ప్రభుత్వం ప్రకటించింది.

రంగారెడ్డిగారి 70వ జన్మదినం

జరపటానికి నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 15

రెవెన్యూ మంత్రి, తెలంగాణా నాయకులలో పెద్ద వారైన శ్రీ కె.వి. రంగారెడ్డి గారికి వచ్చేనెల 11వ తేదీతో 70 యేళ్లు నిండుతాయి. ఆరోజున వైభవోపేతంగా ఆయన జన్మదినోత్సవాన్ని జరపాలని నగరంలో వివిధ పౌరసంఘాలు, సాంఘిక సంస్థలవారు నేడు ఒక సమావేశంలో నిర్ణయించారు.

సంగం వద్ద దుస్సంఘటన

హైద్రాబాద్, నవంబర్ 15

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇక్కడికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న సంగం వద్ద స్నానాల సమయంలో నేడు లక్ష్మణరావు అనే పన్నెండేళ్ళ కుర్రవాడు నీళ్ళలో మునిగి చనిపోయాడు.

పున్నమి స్నానానికి గాను వందల కొలది ప్రజలు అక్కడికి వచ్చారు. హడావిడిలో కుర్రవాడు ఎక్కడ స్నానం చేయాలో తెలియక లోతు నీళ్లలో దిగి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. చాలాసేపు వెదికిన తరువాత శవం దొరికి, బంధువులకు దాన్ని అప్పగించారు.

Edited by K. S Subrahmanyam, published by Smt. Sita Yu[illegible]hir, and printedat the Janath[illegible] Trust Press, Gandhi Bhavan, [illegible] Mukaramjahi Road, Hyderabad.

స్థానిక సాధన సంపత్తి కనుగుణ్యంగా జిల్లా ప్రణాళిక

శ్రీ సంజీవరెడ్డి ఉద్బోధ

నల్లగొండ, నవంబర్ 15

వచ్చే ఐదు సంవత్సరాలలోను ప్రతి గ్రామానికి రోడ్డు, పాఠశాల లాంటి ప్రధాన అవసరాలు సాధించేందు కనుగుణ్యంగా జిల్లా ప్రణాళికల రచన జరగాలని, నల్లగొండ జిల్లా అభివృద్ధి ప్రణాళికా గోష్ఠిని ప్రారంభించిన సందర్భంలో, ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి గత శుక్రవారం నాడు ఉద్బోధించారు.

ఇంతవరకు వివిధ బ్లాకులలో సాధించిన విజయాలను ప్రతినిధులు సమీక్ష చేసుకొని, స్థానిక సాధన సంపత్తితో సాధించడానికి వీలైన విధంగా జిల్లా అభివృద్ధి పథకాలు రచించుకోవాలని వారు సూచించారు.

నల్లగొండ జిల్లాను 19 బ్లాకులుగా విభజించారు. వీటిలో 10 బ్లాకులలో సమాజాభివృద్ధి కేంద్రాలు ఏర్పడి 70 శాతం గ్రామ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

కార్మిక మంత్రి శ్రీ సంజీవయ్యగారు మాట్లాడుతూ వచ్చే ఐదేండ్లలో ప్రతి ఊరికి మంచి నీటి బావులు త్రవ్వించే కార్యక్రమానికి జిల్లా అభివృద్ధి పథకంలో అత్యంత ప్రాముఖ్యం ఇచ్చుకోవడం అవసరమని సూచించారు.

ప్రధానికి అభినందన సందేశాలు

(1వ పేజీ తరువాయి)

డెన్మార్క్ ప్రధాన్ హెచ్.సి. హాన్సెన్, మంగోలియా ప్రధాని సెడన్‌బాల్, ఫిన్లండ్ ప్రధాని వి. జె. సుక్సెలైనెన్, రుమేనియా ప్రధాని చివుయిస్టోక్, బల్గేరియా ప్రధాని ఆంటన్ యుగోవ్, జర్మన్ రిపబ్లిక్ ప్రధాని ఆటోగ్రోట్‌వోల్, అధ్యక్షుడుహోచిమిన్, కెనడా ప్రధాని జాన్ డైఫన్ బేకర్.

లండన్‌లో

లండన్: ప్రధాని నెహ్రూ జన్మదినోత్సవం సందర్భంగా నేడు లండన్‌లో అనేక ప్రాంతాలలో త్రివర్ణ పతాకం ఎగురవేయ బడింది.

టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రచురణల వారు ప్రచురించిన "ఎస్టడీఆఫ్ నెహ్రూ" అనే పుస్తకం ఎలిజిబత్ రాణికి, బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ మాక్మిలన్‌కు సమర్పించడం జరిగింది.

పారిస్‌లో అధ్యక్షుడు జనరల్ డిగాల్‌కు, పశ్చిమ జర్మనీ రాజధాని బోన్‌లోఅధ్యక్షుడు డాక్టర్ కోన్రాడ్ అడినోవర్‌కు కూడా ఈ గ్రంథం ప్రతులు సమర్పించబడినవి. ఇతర దేశాలలో రాజ్యాధిపతులకు కూడాఇలాగే ఈ గ్రంథం ప్రతులు సమర్పించబడుతున్నాయి.

సిలోన్‌లో

ప్రధాని నెహ్రూకు సింహళ ప్రధాని శ్రీ విజయానంద దహనాయకే ఒక ప్రత్యేక సందేశాన్ని పంపారు. సింహళ పత్రికలు ఈ రోజున ప్రధాని నెహ్రూపై ప్రత్యేక వ్యాసాలు ప్రచురించినవి. "సిలోన్ డెయిలీన్యూస్" శ్రీ నెహ్రూ సింహళానికి నిజమైన మిత్రుడని వర్ణించినది.

"ఆకాశం నుంచి అభినందనలు"

భారత సాయుధ దళాల తరపున వైమానికదళంవారు డెహరాడూన్‌లో జన్మదినం గడుపుతున్న ప్రధాని నెహ్రూకు విమానంలో నుంచి అభినందన సందేశం పంపారు. ప్రత్యేక ప్రసారక యంత్రాలు అమర్చబడిన ఒక ఐ. ఏ. ఎఫ్. డకోటా నుంచి సందేశం ప్రసారం చేయబడింది.

కైరోలో

కైరో: కైరోలోని భారత రాయబార కార్యాలయంలో సుమారు 400 మంది ఈజిప్షియన్, భారతీయ బాలబాలికలు ప్రధాని నెహ్రూ జన్మదినోత్సవం జరిపారు. అధ్యక్షుడు కర్నల్ నాసర్, ఈజిప్షియన్ మంత్రులు, కైరోలోని రాయబారుల పిల్లలుకూడా ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. బాలబాలికలకు మిఠాయిలు పంచిపెట్టారు. తర్వాత వినోద కార్యక్రమం జరిగినది

21-11-59 శనివారం మ॥ 2-30 లకు

బ్రహ్మాండమైన విడుదల!

నీతిబోధకమైన హాస్యరస సాంఘిక చిత్రరాజం.....

పద్మినీ పిక్చర్స్ శభాష్ పిల్ల



తారాగణం: శివాజీగణేశన్, చంద్రబాబు, ఎస్. వి. రంగారావు, వి. ఆర్. పంతులు, కుసుమకుమారి, టి. సరోజ మున్నగువారు.

దర్శకత్వం: టి. ఆర్. పంతులు

సాగర్ ??? సరిత మోహన్ రామా

హైదరాబాద్ సికింద్రాబాద్ నిజామాబాద్ వరంగల్

(Trupix) —విజయ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల—

20-11-59 శుక్రవారం సా॥ 2-30 గం॥ లకు

గొప్ప విడుదల!

వినయ విధేయతలతో అష్టకష్టాలు [illegible] మరియు [illegible] వెలుగు చేకూర్చిన మన [illegible]....

శ్రీ సారథి స్టూడియోస్ వారి

భాగ్యదేవత

(సారథి స్టూడియో హైద్రాబాద్‌లో తయారు చేయబడినది)

తా॥ సావిత్రి, రాజసులోచన, సూర్యకాంతం, జగ్గయ్య, రేలంగి, బాలయ్య.

సంగీతం: వేణు

దీపక్ మహల్ హైదరాబాద్ (Trupix) | ప్యారడైజ్ సికింద్రాబాద్ | శ్రీనివాసపిక్చర్ పాలెస్ వరంగల్

- నవయుగ రిలీజ్ -

12 వ సంయుక్త వారం!

శ్రీ వెంకటరమణా ఫిల్మ్స్ వారి

బాలనాగమ్మ

తారాగణం: అంజలి, రాజసులోచన, సూర్యకళ, హేమలత, రేలంగి, ఎన్. టి. రామారావు, ఎస్.వి. రంగారావు

దీపక్ హైదరాబాద్ (Nima) | రాజేశ్వర్ సికింద్రాబాద్ | రాజరాజేశ్వరి వరంగల్

- శ్రీ నేషనల్ ఆర్ట్ పిక్చర్స్ రిలీజ్ -

దిగ్విజయమైన 4 వ సంయుక్త వారం!

యదార్థం ఎప్పుడూ చెప్పని ఒక వ్యక్తి నిజం చెప్పడం మొదలు పెట్టడంతో అతను ఎన్ని కష్టాలను ఎదుర్కోవలసి వచ్చిందో ఈ చిత్రంలో చూడండి!!

సాహితీ ఆర్ట్ వారి

బండ రాముడు

దర్శకుడు పి. పుల్లయ్య | సంగీతం దక్షిణామూర్తి

-: నటీనటులు :-

ఎన్. టి. రామారావు, సావిత్రి, హేమలత, సూర్యకాంతం, రాజనాల, రాజేశ్వరి, పేకేటి, రమణారెడ్డి, చదలవాడ, నాగయ్య, రేలంగి.

కమల్ చిత్ర లక్ష్మి

హైద్రాబాద్ సికింద్రాబాద్ వరంగల్

ఆటల సమయాలు: 6-00, 9-30.

- పూర్ణా రిలీజ్ -

Nima)

19-11-59 గురువారం మ॥ 3-30 నుండి గొప్ప విడుదల!

ఆదర్శ జీవి అయిన ఉపాధ్యాయుడు, మానసిక వ్యధకు లోనైన తండ్రి హృదయవిదారక గాథ

పద్మినీ పిక్చర్స్ సమర్పించు

"స్కూల్ మాస్టర్"

(గేవాకలర్‌లో పిల్లల రామాయణ్ బ్యాలెట్‌తో)

షకీల, కామినీ కదమ్, లలితాపవార్, జేవిడ్, వి. సరోజాదేవి, రాధాకృష్ణన్, రాజగోసవి, ఉల్లాస్, ఎమ్. వి. రాజమ్మ, వి ఆర్. పంతులు

సంగీతం వసంత్ దేశాయ్ | నిర్మాత, దర్శకుడు ఏస్ డైరెక్టర్, బి.ఆర్. పంతులు

ఒకే పర్యాయం: అశోక్ — హైద్రాబాద్ | రాజేశ్వర్ — సికింద్రాబాద్

(Trupix) - ఈస్టు ఇండియా విడుదల -